మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 28-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 118 Issue: 118

28 అక్టోబర్ 2025 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:16 సూర్యాస్తమయం - సా. 5:44 తిథిః పంచమి ఉ. 6:04o వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం జ్యేష్ఠ ఉ. 10:38 వరకు తరువాత మూల యోగం శోభన ఉ. 6:43 వరకు కరణం బవ సా. 4:57 వరకు భాలవ ఉ. 6:04o వరకు వర్జ్యం రా. 7:39 నుండి రా. 9:26 వరకు దుర్ముహూర్తం సా. 4:12 నుండి సా. 4:57 వరకు రాహుకాలం సా. 4:18 నుండి సా. 5:44 వరకు యమగండం మ. 12:00 నుండి మ. 1:26 వరకు గుళికాకాలం మ. 2:52 నుండి సా. 4:18 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:40 నుండి తె. 5:28 వరకు అమృత ఘడియలు లేదుజి అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial

www.evarthalu.com




బ్రిటన్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. 20 ఏళ్ల భారతీయ యువతిపై లైంగిక దాడి జరిగింది. అయితే, ఈ ఘటన జాతి వివక్షతోనే జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## పెచ్చరిల్లుతున్న జాతివివక్ష..

### యూకేలో భారత యువతిపై లైంగిక దాడి

లండన్: ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న సీనియర్ పోలీసు అధికారి రోనన్ టైరర్ మాట్లాడుతూ..'వెస్ట్ మిడ్‌ల్యాండ్స్‌లో 20 ఏళ్ల భారత సంతతికి చెందిన ఒక యువతిపై లైంగిక దాడి జరిగింది. శనివారం వాల్సాల్‌లోని పార్క్ హాల్ ప్రాంతానికి వెళ్లినప్పుడు ఆమెపై జాతి వివక్ష కారణంగానే ఇలా దాడి జరిగింది. ఇందుకు కారణమైన వ్యక్తిని అరెస్టు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేపట్టాం. పరారీలో 2 వ పేజీలో...



కెనడాలో భారతీయులపై జాత్యహంకార దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఓక్‌విల్ నగరంలోని మెక్‌డొనాల్డ్స్ ఔట్‌లెట్‌లో భారతీయ ఉద్యోగిపై ఓ వ్యక్తి అత్యంత దారుణంగా జాత్యహంకార దూషణలకు పాల్పడిన ఘటన కలకలం రేపుతోంది.

## మీ దేశానికి తిరిగి వెళ్లిపోండి

### కెనడాలో భారత ఉద్యోగికి ఘోర అవమానం!

### మరో జాత్యహంకార దాడి..

ఒట్టావా: ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... ఓ వ్యక్తి భారతీయ ఉద్యోగిని ఉద్దేశించి "వెంటనే నీ దేశానికి తిరిగి వెళ్లిపో.. అసహ్యకరమైన భారతీయుడా" అంటూ అనుచిత పదజాలంతో దూషించాడు. అక్కడే ఉన్న ఓ మహిళ అతడిని అడ్డుకుని ప్రశ్నించగా, ఆమెపై కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ 2 వ పేజీలో...



గంపెడాశలతో అమెరికా చేరిన 54 మందిని భారత్ కు పంపించారు యూఎస్ అధికారులు. అక్రమ వలసదారులుగా సొంత ఖర్చులతో ఇండియాకు పంపించింది యూఎస్. మొత్తం 54 మంది భారత యువకులు ఆదివారం ఢిల్లీలోని ఇదిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ల్యాండ్ అయ్యారు.

## అక్రమంగా నివసిస్తున్నారని..

### 54 మంది ఇండియన్స్‌ను గెంటేసిన అమెరికా

వాషింగ్టన్: వీరంతా అడ్డదారిలో.. డంకీ రూట్లో అమెరికాలోకి ఎంటరైనట్లు గుర్తించిన యూఎస్.. తిరిగి వెనకకు పంపించింది. ఇండియా చేరుకున్న వీరంతా హర్యానా రాష్ట్రానికి చెందిన వారు కావడం గమనార్హం. అందులో 16 మంది కర్నాల్ కు చెందిన వారు ఉండగా.. 15 మంది కైతాల్, అంబాలా–5, యమునానగర్–4, కురుక్షేత్ర–4, జింద్–3, సోనిపేట్–2, పంచ్ కులా, పానిపట్, రోహతక్, ఫతేహబాద్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వీళ్లంతా 2 వ పేజీలో...



## తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

### న్యాయశాఖకు సీజేఐ గవాయ్ సిఫార్సు

భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నవంబర్ 24 న జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టనున్నారు.. ఈ మేరకు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్.. తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ పేరును న్యాయ శాఖకి సిఫార్సు చేసారు.

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ గా ఉన్న న్యాయమూర్తి సీజేఐ బాధ్యతలు చేపట్టడం ఆనవాయితీగా వస్తుంది.. ప్రస్తుత సీజేఐ బీఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ పేరును సిఫార్సు చేస్తూ కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు.. జస్టిస్ సూర్యకాంత్ మే 24, 2019న నుంచి సుప్రీంకోర్టు తరువాయి 2 వ పేజీలో...

# 12 రాష్ట్రాల్లో సర్

## ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘం కీలక ప్రకటన

### బీహార్‌లో విజయవంతమైందన్న ప్రధాన ఎన్నికల కమిషనర్

### 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తామని వెల్లడి

### 21 ఏళ్ల కింద ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్న జ్ఞానేశ్ కుమార్



ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్–సర్) ప్రకటించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఎస్ఐఆర్ మొదటగా ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల నుండి ప్రారంభమవుతుంది. బీహార్‌లో ఎస్ఐఆర్ తయారీ ఆధారంగా ఎంపిక చేసిన రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను ప్రారంభిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు. బీహార్‌లో ప్రత్యేక ఇంటెన్సివ్ వెటింగ్ విజయవంతంగా జరిగిందని తెలిపారు.

న్యూఢిల్లీ: ఒక పోలింగ్ బూత్‌లో 1000 మంది ఓటర్లు ఉంటారని తెలిపారు. బీహార్ ప్రజలు ఎస్ఐఆర్‌పై విశ్వాసం వ్యక్తం చేశారని అన్నారు. ఈ సందర్భంగా రెండవ దశ ప్రత్యేక ఇంటెన్సివ్ సమీక్షలో ఈ ప్రచారాన్ని దేశంలోని 12 రాష్ట్రాల్లో అమలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. 21 ఏళ్ల క్రితం దేశంలో చివరిసారిగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించామని తెలిపారు. అర్హులైన ఓటర్లందరినీ ఎస్ఐఆర్‌లో చేర్చుతామని, అనర్హులను ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ఎస్ఐఆర్ నిర్వహించడం చాలా ముఖ్యమని సీఈసీ పేర్కొంది. బీఎల్‌వోలు ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటర్ల సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు. ఈ కాలంలో అర్హులైన ఓటరు ఎవరూ ఈ ప్రచారం నుండి తప్పించుకోకుండా చూసుకోవడం బీఎల్‌వో బాధ్యత. ఎస్ఐఆర్ ప్రక్రియ జరగాల్సిన రాష్ట్రాల్లో సోమవారం రాత్రి 12 గంటల నుంచి ఓటరు జాబితాను స్తంభింపజేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు. ఈ ప్రక్రియ ఇతర రాష్ట్రాలకు వలస వెళ్ళే ఓటర్లు ఆన్‌లైన్ ఫారమ్‌ను పూరించాలని ఆయన చెప్పారు. 1951 - 2 వ పేజీలో...

### ఎస్ఐఆర్ జరగనున్న రాష్ట్రాలు/యూటీలు

అండమాన్ నికోబర్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్.



# రైతులకు నష్టం జరగొద్దు

## వెంటవెంటనే ధాన్యం కొనాలి

### అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు.. 'మొంథా' నేపథ్యంలో సర్కారు అప్రమత్తం



తెలంగాణకు వర్ష సూచన దృష్ట్యా రైతులకు నష్టం కలగకుండా పంటలు కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.. పంటల కొనుగోళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

హైదరాబాద్, అక్టోబర్ 27 (ఈవార్తలు): మొంథా తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ తుఫాను కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మొంథా తుపాను ప్రభావంతో రాగల నాలుగు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,328 |
| వెండి (గ్రాము): | రూ.170 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,534 |

### విశ్వవాణి




ఎవరు పడితే వారు వైద్యం, ఆర్థికం, విద్య, ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇష్టమొచ్చినట్లు వీడియోలు పెడుతుండటంతో చైనా సర్కారు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటివాళ్లను కట్టడి చేసేందుకు ఆ దేశ సర్కారు నియమ, నిబంధనలను అమలు చేయాలని నిర్ణయించింది. కేవలం యూనివర్సిటీ డిగ్రీ, లేక అధికారిక గుర్తింపు ఉన్నవారు మాత్రమే ఆయా రంగాల అంశాలపై చర్చించేలా రూల్స్ తీసుకొచ్చింది.

# అల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి



### కేసీఆర్‌కు మంత్రి లక్ష్మణ్ సూచన

### కేబినెట్‌ను 'దండుపాళ్యం బ్యాచ్' అనడంపై ఫైర్

### హరీశ్ రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 27 (ఈవార్తలు): మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హరీశ్ రావు నోటికి వచ్చినట్లు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ మంత్రివర్గాన్ని 'దండుపాళ్యం బ్యాచ్' అంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాలకు చెందిన మంత్రులున్న కేబినెట్‌ను తరువాయి 2 వ పేజీలో...



# రామన్నా జాగ్రత్త అన్నది కవితే

### కాళేశ్వరంలో హరీశ్, సంతోష్ దోచుకున్నారని కవిత చెప్పారు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. కేటీఆర్‌ది తనస్థాయి కాదని వ్యాఖ్య

కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు, సంతోష్ రావు దోచుకున్నారని, కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని స్వయంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి అంశంలో... రామన్నా జాగ్రత్త" అని కవితనే హెచ్చరించారని గుర్తు చేశారు.

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 27 (ఈవార్తలు): జూబ్లీహిల్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఐదు ముక్కలైందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన స్థాయికి తగిన వ్యక్తి కాదని విమర్శించారు. తాను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఆయన గుంటూరులో ఇంకా చదువుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన చేయని కేటీఆర్ గురించి మాట్లాడటం అనవసరమని అన్నారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ -2 వ పేజీలో...



## నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్ బైండోవర్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 27 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తండ్రి రౌడీ షీటర్ చిన్న శ్రీశైలం యాదవ్ పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ అయ్యారు. చిన్న శ్రీశైలం యాదవ్‌తో సహా వందమంది రౌడీ షీటర్ల బైండోవర్ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా పోలీసులు ఆ నియోజకవర్గంలో 100 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. బోరబండ పోలీస్ స్టేషన్‌లో అత్యధికంగా 74 మంది రౌడీ షీటర్లు ఉన్నారు.

**బైండోవర్ అంటే..**

బైండోవర్ అంటే చట్టపరమైన పరిభాషలో 'సత్ప్రవర్తనకు హామీ' అని అర్థం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారని లేదా ఏదైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడతారని పోలీసులు అనుమానించిన వ్యక్తులను (ముఖ్యంగా ఎన్నికల సమయంలో రౌడీ షీటర్లు, పాత నేరస్తులు వంటివారిని) తరువాయి 2 వ పేజీలో...

# కుక్కలు కరిస్తే ఏం చేస్తున్నారు?

### మీరు న్యూస్ పేపర్లు చదవడం లేదా?..

### వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

### ఆదేశాలు పాటించని రాష్ట్రాల సీఎస్‌లకు సమన్లు

### నవంబర్ 3న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం

వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది.



న్యూఢిల్లీ: వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా తరువాయి 2 వ పేజీలో...

# డిజిటల్ అరెస్టులు పట్టవా?

2

### డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుప్రీం సుమోటో విచారణ

### రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ

దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.

## రాశి ఫలాలు

28.10.2025

మేషం: నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. చేపట్టిన పనులను అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. ఉద్యోగమున అధికారులతో సఖ్యతగా వ్యవహరించడం మంచిది. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. బంధువర్గం నుండి ఆర్థిక సహాయం అందుతుంది. వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

వృషభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు తప్పవు. ఆస్తి వివాదాలు మానసిక చికాకును కలిగిస్తాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వ్యాపార ఉద్యోగాలు మందగిస్తాయి. పనులలో జాప్యం కలుగుతుంది.

మిధునం: వ్యాపార విషయంలో ఆకస్మిక నిర్ణయాలు వలన నష్టాలు తప్పవు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి అధికమవుతుంది. ముఖ్యమైన పనులు శ్రమతో గాని పూర్తి కావు. కొన్ని వ్యవహారాలలో ఆలోచించి ముందుకు సాగడం మంచిది.

కర్కాటకం: స్థిరస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. చాలాకాలంగా పూర్తి కాని పనులను పూర్తి చేస్తారు. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

సింహం: వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి ధన సహాయం లభిస్తుంది. ఉద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. మిత్రులతో శుభకార్యాలకు హాజరవుతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: విద్యార్థుల కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. కుటుంబ సభ్యుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. బంధువర్గంతో వివాదాలు తప్పవు. వ్యాపార ఉద్యోగాలు ఆశించిన విధంగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

తుల: వ్యాపార వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది.

వృశ్చికం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. స్థిరస్తి కొనుగోలు అవరోధాలు తొలగుతాయి. వృత్తి వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఆత్మీయులతో సఖ్యత పెరుగుతుంది. విందు వినోద కార్యక్రమాలకు ధనవ్యయం చేస్తారు.

ధనస్సు: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సన్నిహితులతో చిన్నపాటి వివాదాలతో తప్పవు. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. సోదరులతో ఒప్పందాలు వాయిదా వేస్తారు. ఉద్యోగాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ప్రయాణాలు వీలైనంతవరకు వాయిదా వేయటం మంచిది. దైవచింతన పెరుగుతుంది.

మకరం: చిన్ననాటి మిత్రులతో గృహమున సందడిగా గడుపుతారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

కుంభం: చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యులతో అకారణ మాటపట్టింపులు కలుగుతాయి.

మీనం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు కలిగినప్పటికి నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో అధికారులు అనుగ్రహం కలుగుతుంది. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

# డిజిటల్ అరెస్టులు పట్టవా?

## డిజిటల్ అరెస్ట్ మోసాలపై సుప్రీం సుమోటో విచారణ.. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ

### మోసాల ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం.. ఇది దేశవ్యాప్త స్కాం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమం టూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు. విచారణ సందర్భంగా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

# మీ దేశానికి తిరిగి వెళ్లిపోండి

మొదటి పేజీ తరువాయి

తన దూషణలను కొనసాగించాడు. ఈ దృశ్యాలు కెమెరాలో రికార్డ్ అవ్వడంతో సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించాయి. ఈ వీడియోపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. "ఇది చాలా దారుణం. మా సమాజంలో ఇలాంటి వాటికి చోటు లేదు. ఆ ఉద్యోగి ధైర్యంగా నిలబడటం అభినందనీయం" అని ఒకరు వ్యాఖ్యానించారు. మరికొందరు మాత్రం, "ఇది నిజమైన జాత్యహంకారమా? లేక యువత కేవలం రెచ్చగొట్టడానికి ఇలా ప్రవర్తిస్తున్నారా?" అని సందేహం వ్యక్తం చేశారు. కెనడాలో భారతీయులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. ఈ నెల ప్రారంభంలోనే అంటారియో ప్రావిన్స్ చట్టసభ సభ్యుడు హర్‌దీప్ గ్రేవాల్‌పై ఇద్దరు వ్యక్తులు జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. "హే టర్బన్ హెడ్, మీ ఇంటికి వెళ్లు. మీరంతా చనిపోవాలి" అంటూ ఆయనపై విరుచుకుపడ్డారు. అలాగే ఇటీవల మిస్సిసాగాలోని ఓ చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో "ఇండియన్ రాట్స్" అంటూ గోడలపై జాత్యహంకార రాతలు రాసిన ఫ్రెడా లూకర్ అనే 29 ఏళ్ల మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ తరహా ద్వేషపూరిత నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో పీల్ రీజినల్ పోలీసులు (పీఆర్‌పీ) ప్రత్యేకంగా 'హేట్ క్రైమ్ యూనిట్'ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 12 రాష్ట్రాల్లో సర్

మొదటి పేజీ తరువాయి

నుంచి 2004 వరకు ఎనిమిదిసార్లు ఎస్ఐఆర్ నిర్వహించారని అన్నారు. 21 ఏళ్ల కిందట ఓటర్ల జాబితా సవరణ జరిగిందని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, అక్రమ వలసదారులు, చనిపోయిన, బదిలీ చేయబడిన ఓటర్లను తొలగించినట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. బీహార్‌లో 7.5 కోట్ల మందితో ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తయిందని అన్నారు. ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటరుపై నిర్ధారణ చేసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్‌పై రాజకీయ అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. రెండో దశ ఎస్ఐఆర్ జరగనున్న రాష్ట్రాల్లో 51 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని, నవంబర్ 4వ తేదీ నుండి ప్రారంభమవుతుందని జ్ఞానేశ్ తెలిపారు. అసోంలో ఎన్ఆర్‌సీ ఉన్నందున ఎస్ఐఆర్ లేదని స్పష్టం చేశారు.

**ఎస్ఐఆర్ ప్రయోజనాలివీ..**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఉద్దేశ్యం ఓటర్ల జాబితాను మెరుగుపరచడం. దానిలో కొత్త ఓటర్లను చేర్చడం. ఇందులో పేర్ల వెరిఫికేషన్, పాత ఓటర్ల వెరిఫికేషన్, అవసరమైన సవరణలు ఉంటాయి. ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయంగా ఉంటుందని కమిషన్ తెలిపింది. ఎస్ఐఆర్ కింద, ఓటరు జాబితాలోని తప్పులు తొలగించబడతాయి. కొత్త ఓటర్లను చేర్చడం జరుగుతుంది, తద్వారా ఎన్నికల్లో గరిష్టంగా పాల్గొనడం జరుగుతుంది. 2026లో దేశంలోని ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. అయితే, ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న లేదా జరగనున్న రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ఇప్పట్లో జరగదు, ఎందుకంటే స్థానిక స్థాయి పరిపాలన ఎన్నికల పనిలో బిజీగా ఉంటుంది.

# రామన్నా జాగ్రత్త అన్నది కవితే

మొదటి పేజీ తరువాయి

పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదని అన్నారు. వరుస ఎన్నికల్లో ఓడిపోతే బీఆర్ఎస్ కనుమరుగవుతుందనే భయంతో హరీశ్ రావు, కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై కవిత అవినీతి ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. కవిత చేసిన ఆరోపణల ఆధారంగానే హరీశ్ రావు, కేటీఆర్‌లపై ఫిర్యాదు చేశామని అన్నారు.

# అక్రమంగా నివసిస్తున్నారని..

మొదటి పేజీ తరువాయి

25 నుంచి 40 ఏళ్ల మధ్య ఉన్నారని.. వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే వందలాది మంది ఇండియన్స్ ను అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారుల కింద తిరిగి పంపించిన విషయం తెలిసిందే. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉన్న అక్రమ వలసదారులను తిరిగి వారి దేశాలకు పంపే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా వీసా పూర్తైనవారిని, నిబంధనలకు విరుద్ధంగా వచ్చిన వారిని, అక్రమ వలసదారులను తిరిగి పంపిస్తున్నారు.

# అల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి

మొదటి పేజీ తరువాయి

ఉద్దేశించి ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని అడ్లూరి లక్ష్మణ్ ప్రశ్నించారు. "మా మంత్రివర్గం దండుపాళ్యం బ్యాచ్ అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రివర్గం స్టువర్ట్‌పురం దొంగల ముఠా లాంటిదా?" అని ఆయన నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మంత్రులపై చేసిన ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, హరీశ్ రావు వెంటనే తన మాటలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ మరికొన్ని సంచలన ఆరోపణలు చేశారు. "కేసీఆర్‌కు తెలియకుండానే గతంలో హరీశ్ రావు 28 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సొంతంగా ఫండింగ్ చేశారు. ఈ విషయం తెలియడం వల్లే రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా కేసీఆర్ వెంటనే ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదు" అని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు అవినీతికి పాల్పడ్డారని గతంలో కవిత చేసిన ఆరోపణలను గుర్తు చేస్తూ, దీనిపై చర్చకు రమ్మంటే ఆయన తోక ముడిచారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను చర్చకు పంపుతానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు రావడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. చివరగా, "కేసీఆర్ గారూ.. దయచేసి మీ అల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి" అని అడ్లూరి లక్ష్మణ్ హితవు పలికారు.

# కుక్కలు కరిస్తే ఏం చేస్తున్నారు?

మొదటి పేజీ తరువాయి

హాజరు కావాలని సోమవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

# రైతులకు నష్టం జరగొద్దు

మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ తుపాను ప్రభావం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మీద పడకుండా చూడాలని, రైతాంగం ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించి ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యం తడవకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించాలని, అందుకు అవసరమైన రవాణా వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం సమష్టిగా పని చేయాలని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా, ఇప్పటి వరకు 4,428 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు.

## నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్ బైండోవర్

మొదటి పేజీ తరువాయి

ముందస్తు జాగ్రత్త చర్యగా స్థానిక తహసీల్దార్ లేదా ఆర్డీఓ వంటి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తారు. ఆ వ్యక్తి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడబోనని లిఖితపూర్వకంగా ఒక బాండ్ పేపర్‌పై హామీ ఇస్తాడు. వారు సొంత పూచీకత్తుపై విడుదల అవుతారు. సాధారణంగా, బైండోవర్ అయిన వ్యక్తి ఆ రోజు నుంచి నిర్ణీత కాలం వరకు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. ఒకవేళ బైండోవర్ అయిన తర్వాత వారు నేరానికి పాల్పడితే, వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటారు.

## పెచ్చరిల్లుతున్న జాతివివక్ష..

మొదటి పేజీ తరువాయి

ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక సీసీటీవీ ఫుటేజ్ నుండి వెస్ట్ మిడ్‌లాండ్స్ పోలీసులు నేరస్థుడి ఫొటోను విడుదల చేశారు. సాధ్యమైనంత త్వరగా అతన్ని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తాం. ఆధారాలను సేకరించే అధికార బృందాలు మా వద్ద ఉన్నాయి' అని తెలిపారు. యూకేలో భారత సంతతి ప్రజలపై జాత్యాహంకార దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. సెప్టెంబర్ నెలలో ఓల్డ్‌బరీ పట్టణంలో 20 ఏళ్ల సిక్కు యువతిపై ఇద్దరు దుండగులు లైంగిక దాడికి పాల్పడి, జాతి వివక్ష వ్యాఖ్యలతో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది.

## విద్య, ఉద్యోగవాణి

# 3,500 పీవో పోస్టులు

దేశీయ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. తమ వ్యాపార కార్యకలాపాలు, ఖాతాదారుల సేవలను మరింత విస్తరించే లక్ష్యంతో భారీగా ఉద్యోగ నియామకాలకు శ్రీకారం చుట్టింది. రాబోయే ఐదు నెలల్లో కొత్తగా 3,500 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో) పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు అవసరాల మేరకు ఆఫీసర్లు, క్లరికల్ కేడర్‌లలో కలిపి మొత్తం 18,000 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రణాళికలో భాగంగానే తాజా పీవో నియామకాలు జరుగుతున్నాయి.

# తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

మొదటి పేజీ తరువాయి

న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.. జస్టిస్ సూర్యకాంత్ ఫిబ్రవరి 9, 2027 వరకు.. 14 నెలలకు పైగా భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయనున్నారు. ఫిబ్రవరి 10, 1962న హర్యానాలోని హిసార్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన వ్యక్తి జస్టిస్ కాంత్.. 1981లో హిసార్‌లోని ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల నుండి పట్టభద్రుడయ్యారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. 1984లో హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన జస్టిస్ కాంత్.. మార్చి 2001లో ఆయన సీనియర్ న్యాయవాదిగా నియామకమయ్యారు.. అనంతరం జనవరి 9, 2004న పంజాబ్ హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అక్టోబర్ 5, 2018 నుండి హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసారు.. 2019 మేలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది ప్రస్తుతం సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. గవాయ్ తర్వాత భారత 53వ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ కొనసాగనున్నారు. జస్టిస్ సూర్యకాంత్ భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అనేక ముఖ్యమైన తీర్పులు వెలువరించారు. అనేక సున్నితమైన సామాజికంగా ముఖ్యమైన కేసులలో తీర్పులు ఇచ్చారు. రాజ్యాంగ స్ఫూర్తి, సామాజిక న్యాయం, మానవ హక్కులు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి కీలకంగా ఉన్నాయి. అనురాధ భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2020) కేసులో జస్టిస్ సూర్యకాంత్ జమ్మూ కాశ్మీర్‌లో ఇంటర్నెట్ షట్‌డౌన్‌పై తీర్పు ఇచ్చారు. ఇంటర్నెట్ యాక్సెస్ ఒక ప్రాథమిక హక్కు అని, దానిని నిరవధికంగా ఆంక్షలు విధించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు పేర్కొంది. ఈ తీర్పు డిజిటల్ హక్కులకు సంబంధించి ఒక మైలురాయిగా నిలిచింది. కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2018) పర్యావరణ సంబంధిత కేసులో, జస్టిస్ సూర్యకాంత్ పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కఠిన చర్యలను సమర్థించారు. ఈ కేసులో కాలుష్య నియంత్రణ స్థిరమైన అభివృద్ధిపై దృష్టి సారించారు. మహిళా హక్కులు, సామాజిక న్యాయం సంబంధించి జస్టిస్ సూర్యకాంత్ అనేక కేసులలో మహిళల హక్కులు, లింగ సమానత్వం, సామాజిక న్యాయంపై కీలక తీర్పులు ఇచ్చారు.. లైంగిక వేధింపులు గృహ హింసకు సంబంధించిన చట్టాల అమలుపై కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. రాజ్యాంగ సంబంధిత కేసులలో రాజ్యాంగ విలువలను బలోపేతం చేసే తీర్పులు ఇచ్చారు. పౌరసత్వం, ప్రైవసీ హక్కు, మత స్వేచ్ఛ వంటి అంశాలపై ఆయన తీర్పులు కీలకమైనవి.

# ప్రియుడి కోసం భర్తను చంపి..

**వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని హత్య**

**హత్యను ప్రమాదంగా నమ్మించేందుకు విఫలయత్నం**

మీర్‌పేట/హైదరాబాద్, అక్టోబర్ 27 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో జరిగిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న కారణంతో కట్టుకున్న భర్తనే ఓ భార్య అతికిరాతకంగా హతమార్చింది. అనంతరం ప్రమాదవశాత్తు చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసినప్పటికీ, చివరకు పోలీసులకు చిక్కింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ పరిధిలోని జిల్లెలగూడ ప్రగతినగర్ కాలనీలో అల్లంపల్లి విజయకుమార్ (42), సంధ్య దంపతులు ముగ్గురు పిల్లలతో నివాసముంటున్నారు. విజయకుమార్ ఆటో నడుపుతుండగా, సంధ్య మీర్‌పేట్ మునిసిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో సంధ్య తన సహోద్యోగితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇటీవల విజయకుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి సదరు ఉద్యోగిని హెచ్చరించి నట్లు తెలిసింది. భర్త తన బంధానికి అడ్డువస్తున్నాడని భావించిన సంధ్య, అతడిని ఎలాగైనా అడ్డుతొల గించుకోవాలని నిర్ణయించుకుంది. పథకం ప్రకారం ఈ నెల 20వ తేదీన నీళ్లు తోడే బకెట్‌కు ఉన్న తాడును భర్త మెడకు బిగించి ఊపిరాడకుండా చేసి చంపేసింది. ఆపై కర్రతో తలపై కొట్టి, ప్రమాదంలా కనిపించేందుకు మృతదేహాన్ని బాత్రూమ్ వద్ద పడేసింది. భర్త ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయాడని కుటుంబ సభ్యులను నమ్మించింది. వారు వెంటనే డీఆర్డీవో అపోలో ఆస్పత్రికి తరలించగా, విజయ కుమార్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా అసలు విషయం బయటపడింది. బకెట్ తాడుకు రక్తం మరకలు ఉండటాన్ని మృతుడి తల్లి సత్తెమ్మ, స్థానికులు గమనించారు. దీంతో వారికి అనుమానం వచ్చి వెంటనే మీర్‌పేట్ పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదికలో మెడకు తాడు బిగించడం వల్లే విజయ కుమార్ చనిపోయినట్లు తేలింది. దీంతో పోలీసులు సంధ్యను అదుపులోకి తీసుకుని విచారించగా, ఆమె నేరం అంగీకరించినట్లు సమాచారం.



# మాజీతో కలిసి ప్రియుడిని చంపి..

**తన ప్రైవేట్ ఫొటోల కోసం హత్య**

**దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన**

న్యూఢిల్లీ : రహస్యంగా చిత్రీకరించిన తన ఫొటోలు, వీడియోల కోసం ప్రియుడిని అత్యంత దారుణంగా హతమార్చిందో యువతి. అమ్రిత చౌహాన్(21)అనే యువతి తన ప్రియుడు రంకేష్ మీనా(32)తో ఢిల్లీలోని గాంధీ విహార ప్రాంతంలోని ఒక ఫ్లాట్‌లో నివసిస్తోంది. వారిద్దరు ప్రైవేటుగా కలిసిన వీడియోలు, ఫొటోలను రంకేష్ చిత్రీకరించిన విషయం తెలుసుకున్న అమ్రిత తన ప్రియుడిని హతమార్చాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం తన మాజీ ప్రియుడితో కలిసి ప్లాన్ చేసింది. మాజీ ప్రియుడు సుమిత్ కశ్యప్(27) అతని స్నేహితుడు సందీప్ కుమార్(29) సహాయంతో అక్టోబర్ 6న ప్రియుడి ఫ్లాట్‌కు చేరుకున్నారు. ముగ్గురు కలిసి రంకేష్ మెడకు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం మృతదేహం చుట్టూ నూనె, నెయ్యి పోసి సిలిండర్ ఓపెన్ చేసి పేల్చేశారు. అగ్నిప్రమాదంగా భావించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటల్లో చిక్కుకున్న రంకేష్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. అప్పటికే రంకేష్ మరణించిన విషయాన్ని ప్రాథమికంగా గుర్తించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన పోలీసులు అనుమానంతో అమృత, ఆమె మాజీ ప్రియుడు, అతని స్నేహితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అమృత కోరిక మేరకు రంకేష్‌ను తామే హతమార్చినట్లు ఒప్పుకున్నారు. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

## ‘మనీవ్యూ’ యాప్‌కు 49 కోట్లు బురిడీ

**మూడు గంటల్లోనే దోపిడీ**

**సైబర్ నేరగాళ్ల పంజా**

బెంగళూరు: రుణాలు మంజూరు చేసే యాప్ ‘మనీవ్యూ’కు సైబర్ నేరగాళ్లు సుమారు రూ.49 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టారు. ఈ యాప్ యొక్క ఏపీఐ సిస్టంలోకి చొరబడిన హ్యాకర్లు కేవలం మూడు గంటల వ్యవధిలో దాదాపు రూ.49 కోట్లు కొల్లగొట్టారు. మనీవ్యూ యాప్, విజ్డమ్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ యాప్‌ను దుబాయ్, చైనా, హాంకాంగ్, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందిన సైబర్ హ్యాకర్లు లక్ష్యంగా చేసుకున్నారు. యాప్‌నకు చెందిన ఏపీఐ కీని ఉపయోగించి మూడు గంటల వ్యవధిలో రూ.49 కోట్లను కొట్టేసి, వాటిని 653 నకిలీ ఖాతాలలోకి బదిలీ చేశారని బెంగళూరు సైబర్ క్రైమ్ బ్రాంచ్ వెల్లడించింది. దుబాయ్‌లోని భారత సంతతికి చెందిన ఒక వ్యక్తి, బెళగావికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తి వద్ద నుంచి వర్చువల్ ప్రైవేటు సర్వర్‌ను కొనుగోలు చేసి ఈ సైబర్ దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ కేసులో ఇస్మాయిల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన మరొక వ్యక్తిని బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన రెండో నిందితుడి పేరు మీద ఉన్న నకిలీ ఖాతాకు కూడా డబ్బు బదిలీ అయింది. ఇతర బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అయిన రూ.10 కోట్లను పోలీసులు ఫ్రీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించి దుబాయ్‌లో ముగ్గురిని, హాంకాంగ్‌లో ఇద్దరిని అనుమానితులుగా గుర్తించారు. వారిని గుర్తించేందుకు బెంగళూరు సీసీబీ పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

## సాయిప్రీతి పేరుతో 10 లక్షలు మోసం

**ఆన్‌లైన్ ట్రేడింగ్ ఫ్రాడ్..**

**మోసపోయిన హైదరాబాదీ**

హైదరాబాద్, అక్టోబర్ 27 (ఈవార్తలు): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు రూ. 10 లక్షల మేర మోసగించారు. సాయిప్రీతి అనే పేరుతో చాటింగ్ చేస్తూ అతడి నుంచి భారీగా సొమ్ము కాజేశారు. లంగర్‌హౌస్‌కు చెందిన 42 ఏళ్ల వ్యక్తితో సాయిప్రీతి పేరుతో సైబర్ నేరగాళ్లు చాటింగ్ చేశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 10 లక్షలు పెట్టుబడి పెట్టించారు. బాధితుడు ఆ మొత్తాన్ని విడతల వారీగా పెట్టుబడి పెట్టాడు. మంచి లాభాలు రావడంతో ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించగా విఫలమయ్యాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

# కీచక అటెండర్

**విద్యార్థులతో అసభ్య ప్రవర్తన.. ఒంటిని తాకుతూ వీడియోలు.. ఏడాదికాలంగా వేధింపులు**

**తెలిసీ పట్టించుకోని టీచర్లు.. శుక్రవారం సభతో వెలుగులోకి.. గుట్టుగా అధికారుల విచారణ**

గంగాధర, అక్టోబర్ 27 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న యాకూబ్ పాషా విద్యార్థులను వేధిస్తున్నాడు. విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, అసభ్యంగా తాకడంతో పాటు వీడియోలు తీయడానికి ప్రయత్నించాడు. ఏడాదికాలంగా యాకూబ్ పాషా కీచక పర్వం కొనసాగుతోంది. ఏడాది క్రితం విద్యార్థులు విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేసిన చర్యలు తీసుకోకుండా వార్నింగ్ ఇచ్చి వదిలిపెట్టారు. అయినా పద్ధతి మార్చుకోకుండా విద్యార్థులను వేధిస్తున్నాడు. విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, అసభ్యంగా తాకడంతో పాటు వీడియోలు తీయడానికి ప్రయత్నించాడు. ఏడాదికాలంగా యాకూబ్ పాషా కీచక పర్వం కొనసాగుతోంది. డా విద్యార్థులను నిత్యం వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఉపాధ్యాయులకు తెలిపిన పట్టించుకోకపోవడంతో వేధింపులను ఏడాది కాలంగా విద్యార్థులు పంటి బిగువున భరిస్తున్నారు. గత శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభా కార్యక్రమంలో సంఘటన వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల జిల్లా సంక్షేమ శాఖ, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. నిందితుడు యాకూబ్ పాషాను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పాఠశాలలో ఏడాదికాలంగా విద్యార్థులపై వేధింపులు జరుగుతున్న ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.



యాకూబ్ పాషా చర్యలను కప్పి పెట్టడానికి ఉపాధ్యాయుని ప్రయత్నించారని, ఇంత జరుగుతున్నా కనీసం తమకు సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి విచారణ చేసి రాజులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో విచారణ చేశామని పాఠశాలలో విచారణ చేశామని. నివేదికను ఉన్నత అధికారులకు పంపిస్తామని డీసీపీవో పర్వీన్ తెలిపారు. ఇలాంటి సంఘటనలు దురదృష్టకరమని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తీసుకుంటామని మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు తెలిపారు. ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం స్పందించారు. కరీంనగర్ గ్రామీణ ఏసీపీతో బండి సంజయ్ మాట్లాడారు. నిందితుడు యాకుబ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని బండి సంజయ్ పోలీసులను ఆదేశించారు. నిందితుడి వద్దనున్న వీడియోలను స్వాధీనం చేసుకోవాలన్నారు. అటు.. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎమ్మెల్యే సత్యం తప్పుపట్టారు. పాఠశాలలో ఏడాది కాలంగా విద్యార్థినులపై వేధింపులు జరుగుతున్నా, పాఠశాల సిబ్బంది, సంబంధిత అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో ఫోన్లో మాట్లాడారు. సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి, అటెండర్ యాకూబ్ పాషాను విధుల నుండి తక్షణమే తొలగించాలని కోరారు. సంఘటనలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు మరలా జరగకుండా పాఠశాలల్లో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. “ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తుంది. బాధిత విద్యార్థినులకు పూర్తి భరోసా, సహాయం అందిస్తాం. ఇలాంటి పనులకు పాల్పడిన వారికి కఠిన శిక్ష తప్పద” అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.

# కవితనే గెంటేసిన పార్టీ బీఆర్ఎస్

**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బీఆర్ఎస్‌కు ఫైనల్ పరీక్ష**


**మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 27 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బీఆర్ఎస్‌కు ఒకరకంగా ఫైనల్ పరీక్ష వంటిదని మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని, ఈ ఎన్నికతో ఆ పార్టీ భవిష్యత్తు తేలిపోతుందని అన్నారు. సోమవారం ఆమె ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శోభారాణి మాట్లాడుతూ, “అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను చావుదెబ్బ కొట్టారు. ఇప్పుడు ఆ నేతలు జూబ్లీహిల్స్‌లో సానుభూతి ఓట్ల కోసం డ్రామాలు ఆడుతున్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీత ఇంకా ఆ బాధ నుంచి తేరుకోకముందే, ఆమెను బలవంతంగా ఎన్నికల బరిలోకి దించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. పదేళ్ల పాలనలో ప్రజలను పట్టించుకోని బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు” అని విమర్శించారు. గతంలో పీజేఆర్ కుటుంబ సభ్యులు కేసీఆర్ అపాయింట్‌మెంట్ కోసం గంటల తరబడి ఎదురుచూసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో మహిళలకు ఏమాత్రం గౌరవం లేదని శోభారాణి ఆరోపించారు. “పదేళ్లలో ఏ మహిళకు సరైన పదవి, ప్రాధాన్యత ఇవ్వలేదు. సొంత ఇంటి ఆడబిడ్డ కవితనే ఇంటి నుంచి గెంటివేసినప్పుడే ఆ పార్టీలో మహిళల పరిస్థితి ఏంటో అర్థమవుతోంది. కేవలం రాజకీయాల కోసమే బీఆర్ఎస్ నాటకాలు ఆడుతోంది” అని ఆమె మండిపడ్డారు. అనంతరం ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత మాట్లాడుతూ, రాష్ట్రమంతా జూబ్లీహిల్స్ వైపు చూస్తోందన్నారు. “కాంగ్రెస్ పార్టీ ఒక బీసీ బిడ్డకు అవకాశం ఇస్తే, బీఆర్ఎస్ మాత్రం 22 కేసులు, పీడీ యాక్ట్ ఉన్న సల్మాన్ ఖాన్‌ను పార్టీలో ఎలా చేర్చుకుంది? తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయి నాలుగు ముక్కలాటగా మిగిలిపోయింది” అని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని కవిత మాటలే బయటపెట్టాయని అన్నారు. రాజకీయాలతో సంబంధం లేని మాగంటి సునీతను బలవంతంగా బరిలోకి దించి ఆమె పరువు తీస్తున్నారని సుజాత ఆవేదన వ్యక్తం చేశారు.

# 100 ఎకరాల్లో భారీ గోశాల

**రూ. 157 కోట్లు మంజూరు.. రంగారెడ్డి జిల్లా ఎన్కేపల్లిలో స్థలం**

**40 కుటుంబాలకు పునరావాసం, ఉద్యోగ హామీ**



హైదరాబాద్/రంగారెడ్డి, అక్టోబర్ 27 (ఈవార్తలు) తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద, అత్యంత ఆధునిక గోశాల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. హైదరాబాద్ నగరంలో నిరాదరణకు గురవుతున్న గోవులకు సురక్షిత ఆశ్రయం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామంలో 100 ఎకరాల సువిశాల ప్రభుత్వ భూమిలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇటీవల రూ. 157 కోట్లతో పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడంతో పనులు వేగవంతమయ్యాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు గోశాల నిర్మాణానికి కేటాయించిన భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేసి, హద్దులు నిర్ణయించి హెచ్ఎండీఏకు అధికారికంగా అప్పగించారు. ప్రస్తుతం అధికారులు ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక ముఖ్యమైన మానవతా దృక్పథాన్ని హెచ్ఎండీఏ ప్రదర్శించింది. గోశాలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని గత కొన్నేళ్లుగా సుమారు 40 నిరుపేద కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. గోశాల నిర్మాణం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన హెచ్ఎండీఏ అధికారులు వారితో చర్చలు జరిపి, ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపారు. ప్రతి కుటుంబానికి అదే ప్రాంతంలో 300 గజాల నివాస స్థలం కేటాయించడంతో పాటు కుటుంబంలో ఒకరికి గోశాలలోనే ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల సానుకూల స్పందనతో సంతృప్తి చెందిన ఆ కుటుంబాలు భూమిని అప్పగించేందుకు అంగీకరించాయి. ఈ మెగా గోశాల నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నగరంలో వేలాది గోవులకు సురక్షితమైన ఆశ్రయం లభించనుందని అధికారులు తెలిపారు.

## బీజేపీ, ఎంఐఎం మధ్యే పోటీ

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 27 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమీపిస్తున్న వేళ బీజేపీ ప్రచారంలో దూకుడు పెంచింది. ఈ ఎన్నికలో అసలు పోటీ తమకు, ఎంఐఎం పార్టీకి మధ్యేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బీజేపీకి ఓటు వేయకపోతే, మజ్లిస్ సీట్ల సంఖ్య 8కి పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు అధ్యక్షతన ఉపఎన్నికపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు చర్చించారు. ప్రచారంలో నగరంలోని కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. “జూబ్లీహిల్స్‌లో ఎంఐఎంను ఆపాలంటే బీజేపీని గెలిపించాలి. ప్రజల్లో కూడా బీజేపీని గెలిపించాలనే ఆలోచన బలంగా ఉంది” అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. 2028లో జరిగే సాధారణ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నాంది పలకాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## మహిళా అధికారులకు కాంగ్రెస్ మంత్రుల వేధింపులు

**వారిని వెంటనే బర్తరఫ్ చేయాలి.. బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు**

కరీంనగర్, అక్టోబర్ 27 (ఈవార్తలు): రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళా అధికారులను కాంగ్రెస్ మంత్రులు వేధిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంటికి పిలిచి వార్నింగ్‌లు ఇస్తున్నారని విమర్శించారు. అర్ధరాత్రి మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకోవడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే మహిళల నమ్మకం కోల్పోయిందని ఎద్దేవా చేశారు బండి సంజయ్ కుమార్. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో కేంద్రమంత్రి మాట్లాడారు. మహిళా అధికారులపై కాంగ్రెస్ మంత్రుల వేధింపులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో పోలీసులకే రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారులని వేధింపులకి గురిచేసిన ఆ మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపించారు బండి సంజయ్ కుమార్. పోలీసులపై రౌడీషీటర్లు హత్యాయత్నం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదా..? అని ప్రశ్నించారు. పట్టపగలు గోరక్షకులపై కాల్పులు జరిపితే ఏం చేస్తున్నారు..? అని నిలదీశారు. తప్పు చేసిన రౌడీషీటర్లకు ఎంఐఎం అండగా ఉంటే వారికే వత్తాసు పలుకుతారా..? అని ఫైర్ అయ్యారు. ఒక వర్గం ఓట్ల కోసం ఎంఐఎం నేతల కాళ్లు పట్టుకునే దుస్థితిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. మహిళలు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పుకొచ్చారు. నెలకు రూ.2,500లు, తులం బంగారం, స్కూటీపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. యూపీ తరహాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. రౌడీషీటర్లు బయటకు రావాలంటేనే గజగజ వణికేలా చేయాలని హెచ్చరించారు.

## ఏపీలో ఆరు కొత్త జిల్లాలు!

**జిల్లాల పునర్విభజనపై నేడు బాబుతో సబ్ కమిటీ భేటీ**

అమరావతి, అక్టోబర్ 27 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పుపై ప్రభుత్వ కసరత్తు తుది దశకు చేరుకుంది. జిల్లాల పునర్విభజనకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వినతులు, ప్రతిపాదనలపై ముఖ్యమంత్రితో చర్చించి, ఆయన సూచనల మేరకు తుది నివేదికను రూపొందించనుంది. ఈ నివేదికను నవంబర్ 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదించే అవకాశాలు ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లాల సరిహద్దులు, పేర్ల మార్పు కోసం ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీకి రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నుంచి దాదాపు 200 వరకు అర్జీలు అందాయి. వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన ఉపసంఘం, జిల్లా అధికారుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంది. జనగణన ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబర్ 31వ తేదీలోగా ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వైసీపీ హయాంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించారు. జిల్లాల విభజన, పెంపు జరిగిన నాటి నుంచి అనేక వివాదాలు, అసంతృప్తులు ప్రజలు, రాజకీయ పక్షాల నుంచి నాడు వెల్లువెత్తాయి. ప్రజల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించకుండానే గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గందరగోళానికి దారి తీసింది. అయితే ఈ గందరగోళానికి తెరదించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు, ప్రజలు, రాజకీయ నేతల విజ్ఞప్తుల నేపథ్యంలో 26 జిల్లాలను 32 జిల్లాలు చేసేందుకు ప్రభుత్వం యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆరు కొత్త జిల్లాల ఏర్పాటుపై ఉపసంఘం ముఖ్యమంత్రికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు ఉపసంఘం సానుకూలంగా ఉన్నట్టు సమాచారం. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాలతో ఈ జిల్లాను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. అదేవిధంగా, అమరావతి కేంద్రంగా పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో మరో కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదన కూడా ఉంది. సచివాలయం, అసెంబ్లీ ఇక్కడే ఉండటం, భవిష్యత్తులో పరిపాలనా కార్యకలాపాలు, ప్రోటోకాల్ విధులు పెరగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. ఏజెన్సీ ప్రాంతంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పాటు నాలుగు విలీన మండలాలతో రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై కూడా సీఎం వద్ద చర్చ జరగనుంది. రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రమైన పాడేరు 187 కి.మీ. దూరంలో ఉండటంతో ఈ ప్రతిపాదనకు ప్రాధాన్యత ఏర్పడింది. అలానే ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం నియోజకవర్గాలతో పలాస కేంద్రంగా కొత్త జిల్లా ప్రతిపాదనలో ఉంది. ఇక గూడూరు, వెంకటగిరి, సర్వేపల్లి, సూళ్లూరుపేట నియోజకవర్గాలతో కలిపి గూడురు జిల్లా కేంద్రంగా కొత్త జిల్లా ప్రతిపాదనలో ఉంది. అలానే మదనపల్లి, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలతో మదనపల్లి కేంద్రంగా మరో కొత్త జిల్లా ఏర్పాటుకు ఉప సంఘం ప్రతిపాదించినట్లు సమాచారం. కొత్త జిల్లాలతో పాటు అద్దంకి, మడకశిర సహా 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఒక నియోజకవర్గం రెండు, మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉండటంతో తలెత్తుతున్న పరిపాలనా ఇబ్బందులను తొలగించేందుకు ఒకే నియోజకవర్గ పరిధిలోకి తెచ్చేలా మార్పులు చేయనున్నారు. ఆదోని వంటి పెద్ద మండలాలను విభజించాలనే వినతులపై కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని అశాస్త్రీయ విభజనలను సరిదిద్దే అంశంపైనా దృష్టి సారించారు. కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కొనసాగించాలా లేక ప్రకాశం జిల్లాలో కలపాలా అనే అంశంపై కూడా ఈ భేటీలో స్పష్టత రానుంది.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మల్యాల, అక్టోబర్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లి ప్యాక్స్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభం అయ్యాయి. కొంపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బత్తిని మల్లీశ్వరి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మల్యాల పాక్స్ చైర్మెన్ తొట్ల చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగ ఆనంద రెడ్డి, పాక్స్ మల్యాల వైస్ చైర్మెన్ మ్యాక లక్ష్మణ్, పాక్స్ డైరెక్టర్ మంజుల నరసింహారెడ్డి, రంగు తిరుపతి, సుల్తాన్ లచయ్య, భాస్కర్ రావు, నర్సయ్య, గుర్రం వెంకన్న, మరాఠి సత్తయ్య, మిల్కూరీ గంగారెడ్డి, చంద్రయ్య, బత్తిని మనోజ్ క్రాంతి గౌడ్ , ముదిగంటి రాజు, దిండు ప్రవీణ్, సురేశ్, మరాఠీ బుచ్చిరెడ్డి, గంగారెడ్డి, శంకర గౌడ్, గౌతం, అరుణ్, శ్రావణ్, సంజీవ్, రాజారెడ్డి, పాక్స్ కార్యదర్శి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



## జగిత్యాల జిల్లాలో 71 వైన్స్‌కు లాటరీ

### డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేసిన కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో లాటరీ ద్వారా 71 వైన్ షాపుల కేటాయింపు పూర్తయ్యింది. జిల్లా కలెక్టర్ సమక్షంలో జగిత్యాల విరూపాక్షి గార్డెన్ లో ఏ4 దుకాణాల వైన్ షాపుల కోసం డ్రా నిర్వమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 71 మద్యం దుకాణాలలో ఎస్సీలకు 8, గౌడ వర్గానికి 14, ఓపెన్ కేటగిరీలో 49 మద్యం దుకాణాలు కేటాయించినట్లు తెలిపారు. ఎంపికైన నిర్వాహకులకు డిసెంబర్ 1 నుంచి మద్యం దుకాణాలను కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## 7 నెలల గర్భంతో 145 కిలోల వెయిట్ లిఫ్టింగ్

### కాంస్య పతకం సాధించిన లేడీ కానిస్టేబుల్

విజయవాడ, అక్టోబర్ 27 (ఈవార్తలు): ఢిల్లీకి చెందిన ఓ లేడీ కానిస్టేబుల్ పట్టుదలకు, కార్య దీక్షకు ప్రతీకగా నిలిచింది. ఆమె ఏడు నెలల గర్భంతో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. కాంస్య పతకం సాధించింది. లేడీ కానిస్టేబుల్ విజయ గాథకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఢిల్లీకి చెందిన సోనికా యాదవ్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. సోనికాకు వెయిల్ లిఫ్టింగ్ అంటే మక్కువ ఎక్కువ. చాలా పోటీల్లో పాల్గొని పతకాలు సైతం సాధించింది. పెళ్లైనా కూడా వెయిట్ లిఫ్టింగ్ ఆపలేదు. ప్రతీరోజూ జిమ్‌కు వెళుతూ ఉండేది. ఎక్కడైనా పోటీలు జరిగితే పాల్గొనేది. ఈ నేపథ్యంలోనే ఆమె ఏప్రిల్ నెలలో గర్భం దాల్చింది. అయినా కూడా ఆమె జిమ్ముకు వెళ్లటం ఆపలేదు. డాక్టర్ల పర్య వేక్షణలో వెయిల్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేస్తూనే ఉండేది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025 – 2026'లో పాల్గొంది. ఏడు నెలల గర్భంతో ఆమె పోటీల్లో పాల్గొనటంతో అందరూ ఆశ్చర్యపోయారు. తక్కువ బరువు విభాగంలో పాల్గొంటుందేమో అనుకున్నారు. అయితే, ఎవ్వరూ ఊహించని విధంగా ఆమె 145 కేజీల డెడ్ లిఫ్ట్‌లో పాల్గొంది. డెడ్ లిఫ్ట్‌తో పాటు 125 కేజీల స్క్వాట్స్, 80 కేజీల బెంచ్ ప్రెస్‌లోనూ పాల్గొంది. 145 కేజీల డెడ్ లిఫ్ట్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఏడు నెలల గర్భంతో డెడ్ లిఫ్ట్ చేసి పతకం సాధించి చరిత్ర సృష్టించింది.

## హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక విద్యార్థి సూసైడ్



బోయినపల్లి, అక్టోబర్ 27 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. హాస్టల్ వాతావరణం నచ్చక, తిరిగి వెళ్లడం ఇష్టం లేని ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి గ్రామానికి చెందిన పిట్టల ఆదిత్య (17) తండ్రి మల్లేశం అలుగునూర్‌లోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీ హాస్టల్లో ఉండి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పండుగ నిమిత్తం ఇంటికి వచ్చిన ఆదిత్యకు తిరిగి హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక.. సోమవారం గ్రామ శివారులోని గంగిపెళ్ళి మొండయ్యకు చెందిన పొలం వద్దకు వెళ్లి పత్తి మందు (పురుగుల మందు) తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిత్యను హుటాహుటిన కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బోయినపల్లి ఎస్ఐ రమకాంత్ తెలిపారు.




## భీమన్న గుడిలో కార్తీక సోమవారం శోభ

వేములవాడ, అక్టోబర్ 27(ఈవార్తలు): వేములవాడలోని భీమన్న గుడిలో కార్తీక సోమవారం పురస్కరించుకొని వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక మాసపు మొదటి సోమవారం అయినందున భీమేశ్వరాలయం సమీపంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కోడెముక్కులు, అభిషేకాలు, గండా దీపం, నిత్య కల్యాణం, చండీ హోమం, సత్యనారాయణ వ్రతాలు, లింగార్చనలు వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేలా చూడాలని ఈవో ఆలయ సిబ్బందికి సూచించారు.

## తాగి కాలువలో పడి మృతి

కోనారావుపేట, అక్టోబర్ 27(ఈవార్తలు): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి కొద్ది గంటల్లోనే కాలువలో పడి శవమై తేలిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మల్కాపేట శివారులోని బ్రిడ్జి దగ్గర కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల చిన్న బోనాలకు చెందిన గోస్కుల పరశురాములు ఆదివారం చిన్నబోనాల నుండి తన భార్య, పిల్లలను చూడడానికి కోనరావుపేటలోని అత్తగారి గ్రామానికి వచ్చాడు. అక్కడ మద్యం సేవించి, తిరిగి చిన్నబోనాలకు వెళుతుండగా, మల్కాపేట శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. పోలీసులు వాహనం స్వాధీనం చేసుకుని పరశురాములు పరిస్థితి చూసి, సిరిసిల్లకు వెళ్లే బస్సు ఎక్కించినట్టు సమాచారం. బస్సు ఎక్కిన కొద్ది దూరం తర్వాత అతను దిగిపోయి, గ్రామంలో తూలుతూ, ఎక్కడ పడితే అక్కడ పడుతూ కనిపించాడని స్థానికులు తెలిపారు. రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవడంతో, అతని తల్లి అంతటా వెతికింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం మల్కాపేట శివారులోని బ్రిడ్జి దగ్గర ఉన్న కాలువలో బోర్లా పడి శవంగా కనిపించాడు. తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.





# విజయవాడకు భారీ వర్షసూచన


### 16 సెం.మీ వర్షం పడే అవకాశం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం


విజయవాడ, అక్టోబర్ 27 (ఈవార్తలు): 'మొంథా' తుఫాను ప్రభావంతో విజయవాడ నగరానికి వాతావరణ శాఖ అతి భారీ వర్ష సూచన జారీ చేసింది. మంగళవారం నగరంలో 16 సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తమయ్యారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నారు. తుఫాను తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. వర్షం ఉధృతంగా ఉన్న సమయంలో దుకాణాలు, వాణిజ్య సముదాయాలను మూసివేయాలని సూచించారు. అయితే, పాలు, కూరగాయలు, మెడికల్ షాపుల వంటి నిత్యావసర సేవలకు మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా కృష్ణా నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్, వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్య తలెత్తితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 9154970454కు గానీ, వీఎంసీ కార్యాలయంలోని 08662424172, 08662422515, 08662427485 నంబర్లకు గానీ సంప్రదించాలని అధికారులు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా వీఎంసీ పరిధిలోని 64 డివిజన్లలో మొత్తం 34 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రాలకు వచ్చే వారికి ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తుఫాను ప్రభావం ఉన్నందున, విజయవాడ నగర ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. మొత్తం పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ప్రకటించారు. అక్టోబర్ 27, 28, 29 తేదీలలో ఈ రద్దు నిర్ణయం అమలులో ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 67 రైళ్లను, ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో 43 రైళ్లను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తుఫాను కారణంగా తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు వీస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా మధ్య ప్రయాణించే ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, మెము, ప్యాసింజర్ రైళ్లపై ఈ ప్రభావం పడింది. విజయవాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం వంటి కీలక స్టేషన్ల నుంచి రాకపోకలు సాగించే అనేక రైళ్లు రద్దయ్యాయి. రద్దయిన సర్వీసులలో విశాఖ–హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్, విశాఖ–ఢిల్లీ ఏపీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–తిరుపతి డబుల్‌డెక్కర్, విశాఖ–సికింద్రాబాద్ గరీబ్ రథ్ వంటి పలు ముఖ్యమైన రైళ్లు ఉన్నాయి. వీటితో పాటు అనేక మెము, ప్యాసింజర్ రైళ్లను కూడా నిలిపివేశారు. ప్రయాణికులు తమ ప్రయాణ వివరాల కోసం రైల్వే అధికారిక వెబ్‌సైట్, యాప్‌ను పరిశీలించాలని లేదా హెల్ప్‌లైన్ నంబర్ 139ను సంప్రదించాలని అధికారులు సూచించారు. రద్దయిన రైళ్ల పూర్తి జాబితాను 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసినట్లు వెల్లడించారు.





## తుఫాను బాధితులకు 3 వేలు

### 25 కిలోల బియ్యం కూడా

### ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, అక్టోబర్ 27 (ఈవార్తలు): ఏపీ వైపు వేగంగా కదులుతున్న 'మొంథా' తుఫాను నేపథ్యంలో ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాను సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, ప్రజలకు అండగా నిలవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. తుఫాను కారణంగా ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.3,000 అందించాలని ఆదేశించారు. దీంతో పాటు, ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, వైద్య శిబిరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాల్లో అత్యవసర వైద్య సేవలు అందించే సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం మనం చేపడుతున్న సహాయక చర్యలు భవిష్యత్తులో వచ్చే తుఫానులను ఎదుర్కోవడానికి ఒక రోల్ మోడల్‌గా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## తిరుపతిలో ఆర్టీసీ కొత్త వైద్యశాల

### 6 వేల కుటుంబాలకు ఆరోగ్య భరోసా

తిరుపతి, అక్టోబర్ 27 (ఈవార్తలు): ఆర్టీసీ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన కొత్త వైద్యారోగ్య డిస్పెన్సరీని నిర్మించింది. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో ఈ నూతన భవనాన్ని నిర్మించారు. ఈ నెల 30న ఈ డిస్పెన్సరీని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎండీ ద్వారకా తిరుమలరావు హాజరుకానున్నారు. ఈ కొత్త డిస్పెన్సరీ ద్వారా తిరుపతి జిల్లాలోని 11 డిపోల సిబ్బందితో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కలిపి దాదాపు 6,000 కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. తిరుపతిలోని అలిపిరి డిపో సమీపంలో 1.3 ఎకరాల స్థలంలో రూ.3.89 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని జీ౦3 అంతస్తుల్లో నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, మొదటి అంతస్తులో డిస్పెన్సరీ, రెండు, మూడు అంతస్తుల్లో గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేశారు. వృద్ధులు, రోగుల సౌకర్యార్థం ప్రత్యేకంగా లిఫ్ట్‌ను కూడా అమర్చారు. ఒకేసారి 50 మందికి పైగా కూర్చునేలా విశాలమైన వెయిటింగ్ హాల్, ఫార్మసీ, ఓపీ కేంద్రం, వైద్యుల కోసం ప్రత్యేక గదులు వంటి సకల సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే ఉన్న డిస్పెన్సరీ ద్వారా రోజుకు సుమారు 100 మందికి ఈసీజీతో పాటు, సెమీ ఆటోమోటివ్ ఎనలైజర్ ద్వారా 30 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీనితో పాటు నెలకు సుమారు రూ.3 లక్షల విలువైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. ఈ సేవలన్నీ ఇకపై కొత్త డిస్పెన్సరీలో కూడా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కాగా, ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్ల అంశంపై కూడా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

## దుర్గమ్మ చెంత జోగి రమేశ్ సత్యప్రమాణం

### చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్

విజయవాడ, అక్టోబర్ 27 (ఈవార్తలు): నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో సత్యప్రమాణం చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఆయన, ఘాట్ రోడ్డు ప్రవేశద్వారం వద్ద చేతిలో దీపం వెలిగించి, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జోగి రమేశ్ మాట్లాడుతూ.. "నా వ్యక్తిత్వంపై నింద వేశారు. నా మనసును గాయపరిచారు. అందుకే కుటుంబంతో సహా వచ్చి, ఏ తప్పు చేయలేదని అమ్మవారి ఎదుట నిండు మనసుతో ప్రమాణం చేశాను. నా కుటుంబాన్ని అవమానించిన వారికి అమ్మవారు మంచి బుద్ధి ప్రసాదించాలి" అని అన్నారు. గతంలో తాను చెప్పినట్లే తిరుపతి వెంకన్న, బెజవాడ దుర్గమ్మపై ప్రమాణానికి కట్టుబడి ఉన్నానని, అందులో భాగంగానే ఇప్పుడు ప్రమాణం చేశానని తెలిపారు. నకిలీ మద్యం కేసులో నార్కో అనాలసిస్, లైడిటెక్టర్ టెస్టులకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని పునరుద్ఘాటించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. "నాపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? కనీసం లైడిటెక్టర్ టెస్టుకైనా వచ్చే దమ్ముందా? కనకదుర్గమ్మ సాక్షిగా నేను తప్పు చేసినట్లు నిరూపించాలి" అని సవాల్ విసిరారు.



# ప్రపంచంలోనే తొలి స్కై స్టేడియం

## నిర్మాణానికి సౌదీ అరేబియా సన్నాహాలు

### 2034 ఫిఫా కోసం 350 మీటర్ల ఎత్తులో నిర్మాణం

సౌదీ: ప్రపంచంలోనే మొట్టమొదటి 'స్కై స్టేడియం' నిర్మాణానికి సౌదీ అరేబియా సన్నాహాలు చేస్తోంది. సౌదీ అరేబియాలోని ఫ్యూచర్ సిటీ 'ది లైన్' నగరంలో నియోమ్ స్టేడియం పేరుతో ఈ 'స్కై స్టేడియాన్ని' నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది. 2034 ఫిఫా ప్రపంచ కప్ కోసం దీనిని భూమికి 350 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నారు. 2032 నాటికి ఈ స్టేడియం ప్రారంభమవుతుందని అంచనా వేస్తున్నారు. 'ది లైన్'ను వారు తమ భవిష్యత్తు నగరంగా అభివర్ణిస్తున్నారు. ఈ 'స్కై స్టేడియం' 46,000 మంది ప్రేక్షకులకు ఆతిథ్యం ఇవ్వగలదు. 2034 ఫిఫా ప్రపంచ కప్‌ను సౌదీ అరేబియా నిర్వహిస్తోన్న నేపథ్యంలో ఈ స్టేడియాన్ని పర్యావరణ హితంగా నిర్మించనున్నారు. పూర్తిగా పునరుత్పాదక శక్తితో పనిచేసేలా దీని డిజైన్ రూపొందించారు. అంతేకాకుండా, ఇందులో హైస్పీడ్ ఎలివేటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టేడియం నిర్మాణం 2027లో ప్రారంభించి, 2032 నాటికి పూర్తి చేయాలని సౌదీ అరేబియా ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుతం ఈ స్టేడియంకు సంబంధించిన ఊహాచిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.




# ఆధార్‌లో ఫోన్ నంబర్ చేంజ్ ఈజీ

## అడ్రస్ మార్పు, పేరు కూడా మొబైల్ నుంచే.. నవంబర్ 1 నుంచి మారనున్న రూల్స్

న్యూఢిల్లీ: ఆధార్ కార్డులో మార్పులు చేసుకోవాలంటే ఉదయాన్నే ఆధార్ కేంద్రాలకు పరుగుపెట్టి, చాంతాడంత క్యూలో నిల్చుని టోకెన్ తీసుకుని పడిగాపులు కాస్తే తప్ప సాధ్యం కాదు. చిన్న చిన్న మార్పులకూ ఓ రోజు మొత్తం ఆధార్ కేంద్రంలోనే గడిచిపోతుంది. కొన్నిసార్లు రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల మరుసటి రోజు కూడా పరుగులు పెట్టాల్సి వస్తుంది. ఇకపై ఈ ఇబ్బంది ఉండదని యూఐడీఏఐ తెలిపింది. ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ, జెండర్, చిరునామా, మొబైల్ నెంబర్ వంటి వివరాల్లో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ఆధార్ కేంద్రం దాకా వెళ్లాల్సిన అవసరం లేదని చెబుతోంది. నవంబర్ 1 నుంచి ఈ మార్పులను ఇంట్లో కూర్చుని ఆన్ లైన్ లో మీరే మార్చేసుకోవచ్చని తెలిపింది. ఈమేరకు సరికొత్త విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను మరింత వేగంగా, సురక్షితంగా మార్చడమే ఈ కొత్త ఆన్‌లైన్ విధానం లక్ష్యమని తెలిపింది. ఫింగర్ ప్రింట్స్, ఐరిస్ వంటి బయోమెట్రిక్ అప్‌డేట్స్ కోసం మాత్రం తప్పనిసరిగా ఆధార్ సేవా కేంద్రాన్ని సందర్శించాల్సిందేనని తెలిపింది. అయితే, ఆధార్ అప్ డేట్ కు సంబంధించిన ఫీజులు పెరిగాయి. పేరు, అడ్రస్ మార్పులకు రూ.75, బయోమెట్రిక్ మార్పులకు రూ.125 చెల్లించాల్సిందే. 15 ఏళ్లలోపు చిన్నారులకు బయోమెట్రిక్ మార్చేందుకు ఎలాంటి ఫీజు లేదని యూఐడీఏఐ పేర్కొంది.




# చైనాలో అడుగుపెట్టిన భారత విమానం

## గ్వాంగ్జౌలో ల్యాండ్ అయిన ఇండిగో.. చైనా స్వాగతం

బీజింగ్: గ్వాంగ్జౌలో దిగిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలోని ప్రయాణికులకు సోమవారం చైనా ఘనంగా స్వాగతం పలికింది. దాదాపు ఐదేళ్ల క్రితం గాల్వాన్ లోయ వద్ద ఉద్రిక్తతలు చోటుచేసుకున్న అనంతరం ఇరు దేశాల మధ్య విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ఐదేళ్ల విరామం అనంతరం భారత్-చైనా నడుమ ఇది మొదటి విమానం. "అక్టోబర్ 27న ఉదయం, ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఈ1703 విమానం చైనాలోని గ్వాంగ్జౌకు సురక్షితంగా చేరుకుంది. హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాం" అని భారతదేశంలోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మొదటి విమానం గాంగ్జౌకు బయలుదేరింది. మొదటి విమానం కోల్‌కతా నుంచి గాంగ్జౌకు టేకాఫ్ తీసుకుందని, నవంబర్ 11వ తేదీ నుంచి తాము కోల్‌కతా-గ్వాంగ్జౌ ఎయిర్ బస్ సర్వీసును ప్రతిరోజు నడుపుతామని ఇండిగో ప్రకటించింది. ఈ ఏడాది ప్రారంభంలో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సమావేశమైన సమయంలోనే రెండు దేశాల మధ్య విమాన సర్వీసులను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు.




# పాక్-ఆఫ్ఘన్ చర్చల్లోకి ట్రంప్!

కాబూల్: పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఉగ్రవాద నిరోధక చర్యల విషయంలో తాలిబన్ల వైఖరి 'అహేతుకంగా, వాస్తవాలకు దూరంగా' ఉందని పాకిస్థాన్ తీవ్ర ఆరోపణలు చేయడంతో చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఈ మేరకు పాకిస్థాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నెల 16న ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత, దోహాలో తొలి విడత చర్చలు జరిగాయి. తాజాగా శనివారం ఇస్తాంబుల్‌లో జరిగిన రెండో విడత చర్చలు విఫలమయ్యాయి. సీమాంతర ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు తాము 'స్పష్టమైన, ఆధారాలతో కూడిన పరిష్కారాలను' తాలిబన్ల ముందు ఉంచామని పాకిస్థాన్ పేర్కొంది. అయితే, తాలిబన్ల మొండి వైఖరి, అహేతుక వాదనల వల్ల చర్చలు ముందుకు సాగడం లేదని పాక్ మీడియా సంస్థ 'జియో న్యూస్' తన కథనంలో వెల్లడించింది. అఫ్ఘన్ భూభాగం నుంచి పనిచేస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇస్లామాబాద్ గట్టిగా పట్టుబట్టింది. పాకిస్థాన్ ఆందోళనలను తాలిబన్లకు అర్థమయ్యేలా చెప్పేందుకు టర్కీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. శాంతి చర్చలు విఫలమైతే తాలిబన్లతో 'సంపూర్ణ యుద్ధానికి' దిగుతామని ఆయన స్పష్టం చేశారు. అయితే, గత నాలుగైదు రోజులుగా సరిహద్దుల్లో ఎలాంటి ఘర్షణలు జరగలేదని, తొలి విడత చర్చల్లో అంగీకరించిన అంశాల్లో 80 శాతం ఇప్పటికే అమలవుతున్నాయని కూడా ఆయన తెలిపారు. పాక్-అఫ్ఘన్ వివాదాన్ని తానే పరిష్కరిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకొచ్చారు. మలేషియాలో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన మాట్లాడుతూ "పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య మళ్లీ వివాదం మొదలైందని విన్నాను. కానీ నేను దాన్ని చాలా త్వరగా పరిష్కరిస్తాను. వాళ్లిద్దరూ నాకు తెలుసు" అని వ్యాఖ్యానించారు. వివాదాలను పరిష్కరించడం తనకు బాగా చేతనైన పని అని, దీని ద్వారా లక్షలాది ప్రాణాలను కాపాడగలనని ఆయన అన్నారు.

# దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్లు

ముంబై: అంతర్జాతీయ సానుకూల పవనాలతో భారత స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో దూసుకెళ్లాయి. గత వారం స్వల్ప విరామం తర్వాత తిరిగి పుంజుకున్న సూచీలు, వారాన్ని భారీ లాభాలతో ప్రారంభించాయి. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరవచ్చన్న అంచనాలు ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. దీనికి తోడు అమెరికాలో ద్రవ్యోల్బణం గణాంకాలు ఆశాజనకంగా ఉండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 566.96 పాయింట్లు లాభపడి 84,778.84 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ 170.9 పాయింట్లు పెరిగి 25,966.05 వద్ద ముగిసింది. చైనా వస్తువులపై 100 శాతం టారిఫ్‌లు విధించే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెన్ ఆదివారం ప్రకటించారు. అంతేకాకుండా, చైనా సోయాబీన్ దిగుమతులను పెంచే అవకాశం ఉందని, రేర్ ఎర్త్ ఎగుమతులపై ఆంక్షలను వాయిదా వేయవచ్చని ఆయన చెప్పడంతో ప్రపంచ మార్కెట్లలో విశ్వాసం పెరిగింది. మరోవైపు, అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా నమోదు కావడంతో, 2025లో మరో రెండు సార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని మార్కెట్లు ఆశిస్తున్నాయి. "నిఫ్టీ మంచి లాభాలతో ప్రారంభమైంది, అయితే ఎన్ఎస్ఈ ఎఫ్అండ్‌వో ఎక్స్‌పైరీ నేపథ్యంలో రోజంతా దాదాపు ఒకే స్థాయిలో కదలాడింది. బ్రేకౌట్ పాయింట్ పైన నిలదొక్కుకోవడం చూస్తే సెంటిమెంట్ బలంగానే ఉందని అర్థమవుతోంది" అని విశ్లేషకులు తెలిపారు. "దిగువన 25,700 వద్ద మద్దతు ఉంది, దాని



కిందకు పడితే బలహీనపడవచ్చు. ఇక ఎగువన 26,000 వద్ద నిరోధం ఉంది, దీన్ని దాటితే స్వల్పకాలంలో 26,500 స్థాయికి ర్యాలీ జరగవచ్చు," అని వారు వివరించారు. సెన్సెక్స్‌లో భారతీ ఎయిర్‌టెల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎటర్నల్ షేర్లు 2 శాతానికి పైగా లాభపడ్డాయి. మరోవైపు, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ వంటివి నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా రాణించాయి.

## 50 కోట్ల ఇన్సూరెన్స్ కోసం..

# తండ్రి, తల్లి, భార్యను చంపిన కొడుకు!

మీరట్: మీరట్‌కు చెందిన ఓ ప్రబుద్ధుడు ఏకంగా కన్న తల్లిదండ్రులు, కట్టుకున్న భార్యనే ఇన్సూరెన్స్ డబ్బుల కోసం అతి కిరాతకంగా హత్య చేశాడు. ఏళ్ల తరబడి వీటిని ప్రమాదాలుగా నమ్మిస్తూ వచ్చిన ఈ దారుణాల వెనుక ఉన్న అసలు కుట్ర ఇటీవలే బయటపడింది. రూ.100 కోట్ల ఇన్సూరెన్స్ ఫ్రాడ్ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఈ హత్యల మిస్టరీని ఛేదించారు. రూ.50 కోట్ల బీమా సొమ్ము కోసం కన్నతండ్రినే ఆసుపత్రిలో దిండుతో ఊపిరాడకుండా చేసి చంపిన కొడుకు విశాల్ సింఘాల్‌ను, అతని స్నేహితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మీరట్‌లోని గంగా నగర్‌లో నివసించే ముకేశ్ సింఘాల్ కుటుంబం ప్రశాంతంగా జీవించేది. ఆయనతో పాటు భార్య ప్రభాదేవి, కొడుకు విశాల్, కోడలు ఏక్తా ఉండేవారు. 2017లో రోడ్డు ప్రమాదంలో ప్రభాదేవి తలకు తీవ్ర గాయాలై మీరట్‌లోని ఆనంద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆ విషాదం నుంచి కోలుకోకముందే, 2022లో కోడలు ఏక్తా అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై అదే ఆసుపత్రిలో చికిత్స తర్వాత చనిపోయింది. ఈ క్రమంలో 2024 మార్చిలో ముకేశ్ సింఘాల్ కూడా హాపూర్‌లో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయనకు చిన్న గాయాలు మాత్రమే కావడంతో మొదట నవజీవన్ ఆస్పత్రికి తరలించారు. కానీ, అదే రోజు రాత్రి కొడుకు విశాల్ ఆయనను మీరట్‌లోని ఆనంద్ ఆసుపత్రికి మార్చాడు. అక్కడ చికిత్స పొందుతూ ముకేశ్ కూడా మరణించారు. అయితే, ఇవన్నీ ప్రమాదాలు కావని, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం విశాల్ సింఘాల్ పక్కా ప్రణాళికతో చేసిన హత్యలని తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది జనవరిలో సంభల్ పోలీసులు బయటపెట్టిన రూ.100 కోట్ల ఇన్సూరెన్స్ మోసం కేసు దర్యాప్తులో ఈ దారుణాలు వెలుగుచూశాయి. సంభల్ ఏఎస్పీ అనుకృతి శర్మ బృందం ఇన్సూరెన్స్ ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను ఛేదించినప్పుడు, ఇటీవల జరిగిన ప్రమాద మరణాలు, వాటి క్లెయిమ్‌ల డేటాను అన్ని కంపెనీల నుంచి తెప్పించుకున్నారు. ఆ పరిశీలనలోనే ముకేశ్ సింఘాల్ కేసు అనుమానాస్పదంగా కనిపించింది. ముకేశ్ పేరు మీద రూ.50 కోట్ల విలువైన లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు ఉన్నాయి. ఇప్పటికే రూ.39 కోట్లకు పైగా క్లెయిమ్‌లు దాఖలయ్యాయి. ఒక కంపెనీ నామినీగా ఉన్న విశాల్‌కు రూ.1.5 కోట్లు విడుదల చేయగా, మిగిలిన కంపెనీలు అభ్యంతరాలు తెలిపాయి. ఏఎస్పీ అనుకృతి శర్మ మాట్లాడుతూ "విశాల్ గతంలో ఇన్సూరెన్స్ ఇన్వెస్టిగేటర్‌గా పనిచేశాడు. అతడికి మానవత్వం లేదు, కేవలం డబ్బే ముఖ్యం. అందుకే, తానే నామినీగా ఉన్న తన కుటుంబ సభ్యులనే సులభమైన లక్ష్యాలుగా ఎంచుకున్నాడు" అని తెలిపారు. తల్లిని చంపిన తర్వాత విశాల్ తన తండ్రిని చంపడానికి మూడేళ్లు ఆగాడు. ఈ సమయంలో, అతడు వివిధ కంపెనీల నుంచి అనేక లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు కొన్నాడు. 2024 మార్చి 27న తన బావ సంజయ్, స్నేహితుడు సతీశ్‌తో కలిసి హాపూర్‌లో తన తండ్రికి యాక్సిడెంట్ డ్రామా సృష్టించాడు. కానీ, ముకేశ్‌కు చిన్న గాయాలు మాత్రమే అయ్యాయి. దీంతో ఆయనను ఆనంద్ ఆసుపత్రికి మార్చి, అక్కడ హత్య చేసేందుకు పలుమార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. చివరకు, ఆసుపత్రిలోనే ఓ డాక్టర్‌కు రూ. లక్ష, మేనేజర్‌కు రూ. 50 వేలు ఇచ్చి వారి సహాయంతో ఏప్రిల్ 1-2 మధ్య రాత్రి దిండుతో ఊపిరాడకుండా చేసి ముకేశ్‌ను హత్య చేశాడు.

# ట్రంప్ మూసుకుంటే మంచిది!

## నీతులు బోధిస్తారు.. పాటించరు

## అమెరికా అధ్యక్షుడిపై జైశంకర్ ఆగ్రహం




న్యూఢిల్లీ: రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒక్కో దేశంతో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నీతులు బోధించేవారే వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకం విధిస్తున్న విషయం విదితమే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ దేశాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో జైశంకర్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఐయామ్ సారీ.. ఫార్మర్స్

## క్షమాపణలు చెప్పిన కంగనా రనౌత్



న్యూఢిల్లీ: 2020-21లో ఢిల్లీలో రైతుల నిరసనలపై బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యవహారంలో ఆమె క్షమాపణలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దేశ రాజధానిలో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఆ సమయంలో మహీందర్ కౌర్ అనే 73 ఏళ్ల మహిళపై కంగన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా షాహిన్‌బాగ్‌లో నిరసన తెలిపిన బిల్కిస్ బానో, రైతు ఉద్యమంలో పాల్గొన్న మహీందర్ కౌర్ ఇద్దరూ ఒకటేనంటూ కంగన ఒక పోస్టును రీట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో మహీందర్ కౌర్ ఫిర్యాదు మేరకు కంగనపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణ నిమిత్తం కంగనా రనౌత్ నేడు కోర్టుకు హాజరయ్యారు. ఆనాటి పోస్టుకు ఆమె క్షమాపణ కోరారు. తాను కావాలని ఆ వ్యాఖ్యలు చేయలేదని, జరిగినందుకు చింతిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. తనపై నమోదైన పరువు నష్టం కేసును కొట్టివేయాలంటూ కంగన సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది.

# బీహార్‌లో బీజేపీ గెలవదు: కేఏ పాల్




పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవదని, ఆ పార్టీయే ఆర్జేడీని గెలిపిస్తుందని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో అసలైన ఓట్లను తొలగించి, లేని ఓట్లను చేర్చారని ఆరోపించారు. దేశంలో ఈవీఎం ద్వారా ఓటింగ్ ఉన్నంత వరకు బీజేపీ అధికారంలో ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. బీహార్‌లో బీజేపీ గెలిస్తే దేశ ప్రజలకు అనుమానం వస్తుందనే ఆలోచనతో అక్కడ ఆర్జేడీని గెలిపిస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే జరగాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాలెట్ విధానం కోసం తన పార్టీ పోరాడుతోందని కేఏ పాల్ పేర్కొన్నారు.

# జకీర్ నాయక్‌కు బంగ్లా ఘన స్వాగతం!

ఢాకా: వివాదాస్పద మతబోధకుడు జకీర్ నాయక్ బంగ్లాదేశ్‌లో పర్యటించనున్నారు. యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం జకీర్ పర్యటనకు అనుమతించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. జకీర్ నాయక్‌కు స్వాగతం పలికేందుకు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని సమాచారం. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 20 వరకు జకీర్ నాయక్ బంగ్లాదేశ్ పర్యటన కొనసాగనుంది. జకీర్ నాయక్ బంగ్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. జూలై 2016లో ఢాకాలోని ఒక బేకరీపై ఉగ్రదాడి జరిగింది. ఆ దాడి అనంతరం ఒక ఉగ్రవాది మాట్లాడుతూ యూట్యూబ్ ఛానల్ ద్వారా జకీర్ చేసిన బోధనలకు తాను ప్రభావితమయ్యానని చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. ఆ సమయంలో భారత్‌లో ఉన్న జకీర్ అరెస్టు భయంతో మలేసియాకు పారిపోయాడు. దీంతో మనీలాండరింగ్, విద్వేష ప్రసంగాల ఆరోపణల కేసులో భారత్ జకీర్‌ను వాంటెడ్‌గా ప్రకటించింది. జకీర్ నాయక్‌కు చెందిన పీస్ టీవీని అప్పటి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా నిషేధించారు. అలాంటి వ్యక్తికి యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారికంగా స్వాగతం పలకనుంది. జకీర్ నాయక్ గత ఏడాది పాకిస్థాన్‌లో కూడా పర్యటించారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా నాడు జకీర్‌కు ఘన స్వాగతం పలికారు.

# టర్కీలో నెతన్యాహు దిష్టిబొమ్మకు ఉరి

## తీవ్రంగా ఖండించిన ఇజ్రాయెల్





జెరూసలేం: టర్కీ, ఇజ్రాయెల్ మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలు మరింత క్షీణించేలా తాజా ఘటన చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు దిష్టిబొమ్మను క్రేన్‌కు వేలాడదీసి నిరసన తెలపడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ చర్యను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. టర్కీలోని ట్రాబ్జోన్ నగరంలో శనివారం, అక్టోబర్ 25న ఈ నిరసన జరిగింది. ఒక నిర్మాణ స్థలంలోని క్రేన్‌కు నెతన్యాహు దిష్టిబొమ్మను ఉరితీశారు. దాని పక్కనే "నెతన్యాహుకు మరణశిక్ష" అనే అర్థం వచ్చేలా ఒక బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం స్పందించింది. దీనిని "అవమానకరమైన ప్రవర్తన"గా అభివర్ణించింది. ప్రభుత్వ సంబంధాలున్న సంస్థ మద్దతుతో ఒక టర్కిష్ విద్యావేత్త ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని ఆరోపించింది. ఈ ఘటనపై టర్కీ అధికారులు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. టర్కిష్ మీడియా కథనాల ప్రకారం ఆర్ట్‌విన్ కోరుహ్ యూనివర్సిటీలో విజువల్ కమ్యూనికేషన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కెమల్ సగ్లామ్ ఈ నిరసనను నిర్వహించారు. గజాలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను ప్రపంచం దృష్టికి తీసుకురావడానికే ఈ ప్రదర్శనను ప్రతీకాత్మకంగా నిర్వహించినట్లు ఆయన స్థానిక మీడియాతో చెప్పారు.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
మంగళవారం 28-10-2025
www.evarthalu.com


వయ్యారి చిత్రం


నిఖిత దత్తా



## బాహుబలి ది ఎపిక్‌లో సర్‌ప్రైజ్

దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కించిన మాగ్నమ్ ఓపస్ చిత్రం బాహుబలి, బాహుబలి-2 ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచానికి చాటి చెప్పింది. ఈ సినిమాల్లో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క, రమ్యకృష్ణ, తమన్నా, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఇక ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర కొల్లగొట్టిన వసూళ్ల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది బాహుబలి ఫ్రాంచైజీ. అయితే, ఇప్పుడు ఈ ఫ్రాంచైజీలోని రెండు సినిమాలను 'బాహుబలి ది ఎపిక్' అంటూ రీ-కట్ వెర్షన్‌తో మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేసేందుకు జక్కన్న అండ్ టీమ్ రెడీ అయ్యారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ రిలీజ్ అవగా, దానికి సాలిడ్ రెస్పాన్స్ దక్కింది. అయితే, ఈ సినిమాలో ఓ సర్‌ప్రైజ్ ఉండబోతుందని చిత్ర యూనిట్ చెబుతోంది. సినిమాటోగ్రఫర్ సెంథిల్ కుమార్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బాహుబలి ది ఎపిక్ చిత్రంలో బాహుబలి, బాహుబలి 2 చిత్రాల్లో లేని ఓ కొత్త సీన్ ఉండబోతుందని.. ఇది ప్రేక్షకులను థ్రిల్ చేయడం ఖాయమని తెలిపారు.




## నన్ను ఐరన్‌లెగ్ అనేవారు

సీనియర్ హీరోయిన్ రమ్యకృష్ణ స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. ఐతే, జగపతిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా'.తాజాగా రమ్యకృష్ణ ఈ షోకు అతిథిగా వచ్చి.. తన కెరీర్ ప్రారంభ రోజులను ఆమె గుర్తుచేసుకున్నారు. 'నాకు ఇప్పటికీ గుర్తు. నా కెరీర్ ప్రారంభంలో అందరూ నన్ను ఐరన్‌లెగ్ అనేవారు. తెలుగులో నా తొలిచిత్రం 'భలే మిత్రులు'. అందులో సెకండ్ హీరోయిన్‌గా నటించాను. ఆ సమయంలో వరుసగా 7 సంవత్సరాలు నేను నటించిన అన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యాయి' అని ఆమె తెలిపింది. రమ్యకృష్ణ ఇంకా మాట్లాడుతూ.. 'ఆ ఫ్లాప్ ల సమయంలో దర్శకుడు విశ్వనాథ్ గారు 'సూత్రధారులు' కోసం నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. డాన్స్ చేయమన్నారు. ఆయనకు నచ్చి ఓకే చేశారు. యాక్టింగ్‌లో స్కూల్, కాలేజ్, పీజీ మొత్తం ఆ ఒక్క సినిమాతో నేర్చుకున్నాను. ఆ సినిమానే నా కెరీర్‌కు తొలిమెట్టు. ఆ చిత్రం చూసిన తర్వాతే రాఘవేంద్రరావు 'అల్లుడుగారు'లో అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత నా కెరీర్ చాలా స్పీడ్ తో వెళ్ళింది. మంచి సినిమాలు చేశాను' అని ఆమె చెప్పుకొచ్చింది.

## మాస్ జాతర.. వార్ జోన్!

పోలీస్ క్యారెక్టర్ తో బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్ రేటును పెంచుకున్న మాస్ రాజా రవితేజ ఈసారి మళ్ళీ అదే ఫార్ములతో రాబోతున్నాడు. రవితేజ 75వ సినిమా 'మాస్ జాతర' ప్రమోషన్ తోనే పాజిటివ్ హైప్ క్రియేట్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఇక ట్రైలర్ ద్వారా సినిమాపై అసలు క్లారిటీ ఇచ్చేశారు. ట్రైలర్ చూస్తే, ఇది రొటీన్ పోలీస్ స్టోరీ కాదనిపిస్తోంది. ట్రైలర్ మొదట్లోనే ఏదో పెద్ద స్మగ్లింగ్ రాకెట్ గుట్టు విప్పే సీన్లతో, కథ చాలా ఇంటెన్స్‌గా ఉండబోతుందని హింట్ ఇచ్చారు. అడవులు, పాత రైల్వే స్టేషన్లు, గూడ్స్ ట్రైన్లు.. విజువల్స్ అన్నీ చాలా రా అండ్ రస్టిక్‌గా, ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉన్నాయి. ఈ చీకటి సామ్రాజ్యంలోకి ఎంట్రీ ఇచ్చే మహారాజా, ఒక పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా విలన్స్ ను ఊచకోత కొస్తాడని అర్ధమవుతుంది. అలాగే "నేను రైల్వే పోలీస్ కాదు.. క్రిమినల్ పోలీస్".. అనే ఈ ఒక్క డైలాగ్‌తో క్యారెక్టర్ ఎలా ఉండబోతోందో చెప్పేశారు.



## అలాంటోడే భర్తగా రావాలి

టాలీవుడ్‌లో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్‌గా ఎదుగుతున్న శ్రీలీల ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. హిట్,ఫ్లాపులతో సంబంధం లేకుండా తనకు నచ్చిన కథలు, పాత్రలతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా విజయం సాధిస్తే ఆమె కెరీర్‌కు మలుపు తిరుగుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే రవితేజ హీరోగా తెరకెక్కుతున్న మాస్ జాతర చిత్రంలోనూ శ్రీలీల కీలక పాత్రలో నటిస్తోంది.సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, శ్రీలీల అప్పుడప్పుడు పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటూ తన వ్యక్తిగత జీవితం, ఆలోచనలను పంచుకుంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన కాబోయే భర్తకు ఉండవలసిన లక్షణాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తనకు కాబోయే వ్యక్తి అందంగా లేకపోయినా ఫర్వాలేదు కాని, కానీ తనను బాగా అర్థం చేసుకునే వ్యక్తి కావాలని శ్రీలీల పేర్కొంది. అలాగే తన సినీ కెరీర్‌కు మద్దతుగా నిలిచి, ప్రేమతో చూసుకునే వ్యక్తి, సరదాగా ఉండే వ్యక్తి, అన్నింటికంటే ముఖ్యంగా నిజాయితీగల వ్యక్తి కావాలని తెలిపింది. "అలాంటి వ్యక్తి ఎదురైతే తప్పకుండా పెళ్లి చేసుకుంటాను" అంటూ స్పష్టం చేసింది.




## లేటుగానైనా లేటెస్ట్‌గా.. !



**ఎంట్రీకి సిద్ధమైన మిస్ యూనివర్స్**

2019లో మిస్ యూనివర్స్ ఇండియాగా నిలిచిన వర్తిక సింగ్ లక్ కలిసి రాకపోవడంతో 2020లో కరోనా వచ్చింది. ఆ తర్వాత కూడా ఈమెకు చిన్నా చితక ఆఫర్స్ తలుపు తట్టిన పెద్దగా ఆసక్తి చూపించలేదు. అయితే ఇప్పుడు వర్తిక సింగ్ సినిమాల్లో ఎంట్రీకి సిద్ధం అయింది. మూడు పదుల వయసు దాటిన తర్వాత వర్తిక ఇప్పుడు ఇండస్ట్రీలో ఎంట్రీకి రెడీ అయింది. 32 ఏళ్ల వయసులో వర్తిక సింగ్ తన మొదటి బాలీవుడ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇమ్రాన్ హష్మీ, యామి గౌతమ్ ముఖ్య పాత్రల్లో నటించిన కోర్ట్ డ్రామా మూవీ 'హక్' లో వర్తిక సింగ్ ముఖ్య పాత్రలో కనిపించబోతుందట. ఈ పాత్రతో బాలీవుడ్‌లో వర్తిక బిజీ అవుతుందని అంటున్నారు. హీరోయిన్‌గా కాకుండా ముందు ముందు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ నటిగా వర్తిక సింగ్ నిలుస్తుందనే విశ్వాసంను హక్ చిత్ర యూనిట్ సభ్యులు చాలా నమ్మకంగా వ్యక్తం చేస్తున్నారు.



## రొమాంటిక్ సాంగ్‌తో వస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా'

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. దర్శకుడు పి.మహేష్ బాబు డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ మూవీపై సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమాకు వివేక్-మెర్విన్ ద్వయం సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుండి మరో క్రేజీ అప్డేట్ వచ్చింది. ఈ సినిమా నుంచి మూడో సింగిల్ సాంగ్‌గా ఓ రొమాంటిక్ పాటను మేకర్స్ రిలీజ్ చేయబోతున్నారు. 'చిన్ని గుండెలో' అంటూ సాగే ఈ పాటలో హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ బొర్సే మధ్య వచ్చే కెమిస్ట్రీ ప్రేక్షకులను థ్రిల్ చేయబోతుందని మేకర్స్ చెబుతున్నారు.

## 31న ఓటీటీలోకి కాంతార-1

భారీ అంచనాల నడుమ విడుదలైన 'కాంతార: చాప్టర్-1' దూకుడు కొనసాగిస్తుంది. విడుదలైన మూడు వారాల వ్యవధిలోనే ఈ చిత్రం 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు ఎప్పుడెప్పుడు వస్తుందా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న సమయంలో అమెజాన్ ప్రైమ్ వీడియో తాజాగా క్లారిటీ ఇచ్చేసింది.





# ఐసీయూ నుంచి వార్డుకు..!



## నిలకడగానే శ్రేయస్ ఆరోగ్యం

సిడ్నీ వన్డేలో క్యాచ్ అందుకునే క్రమంలో గాయపడిన శ్రేయస్ అయ్యర్ కోలుకుంటున్నాడు. రెండు రోజులుగా వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్న అయ్యర్‌ను.. సోమవారం ఐసీయూ నుంచి స్పెషల్ వార్డుకు మార్చారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్లు చెప్పారు. అయితే.. అస్పత్రిలోనే మరో రెండు మూడు రోజులు ఉండాల్సి వస్తుందని తెలిపారు. వైస్ కెప్టెన్ అయిన అయ్యర్.. పూర్తిగా కోలుకునేందుకు మూడు వారాలకు పైగా సమయం పట్టనుందని సమాచారం. 'మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తూ.. క్యాచ్ అందుకుంటున్న సమయంలో అయ్యర్‌కు గాయమైంది. ఎడమవైపు పొత్తకడుపు కింది భాగంలో అతడి మోచేయి బలంగా తాకింది. దాంతో.. నొప్పితో విలవిల్లాడిన అతడిని ఫిజియో పరీక్షించారు. అయినా అయ్యర్ ఇబ్బందిపడుతూనే ఉండడంతో ఆసల్యం చేయకుండా ఆస్పత్రిలో చేర్పించారు. స్కానింగ్ పరీక్షల్లో అతడికి ప్లీహం భాగంలో గాయం అయినట్టు గుర్తించాం. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉంది. వేగంగా కోలుకుంటున్నాడు. బీసీసీఐ వైద్యబృందం అయ్యర్ అరోగ్యాన్ని అనుక్షణం పర్యవేక్షిస్తోంది. అతడి ఆరోగ్యంలో రోజూవారీ పురోగతిని గమనించేందుకు టీమిండియా డాక్టర్ సిడ్నీలోనే ఉండనున్నాడు' అని బీసీసీఐ ఒక ప్రకటలో వెల్లడించింది. అంతేకాదు అయ్యర్‌కు అండగా కొందరు స్నేహితులు ఉన్నారని.. వీసా ప్రక్రియ పూర్తికాగానే అతడి కుటుంబసభ్యులు కూడా సిడ్నీ చేరుకుంటారని బీసీసీఐ తెలిపింది.



## సెలెక్టర్లపై రహానే మండిపాటు

టీమిండియా సెలెక్షన్ కమిటీ తీరుపై వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నా.. ఏజ్ ఎక్కువని తనను సెలెక్టర్లు పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. ఫామ్ కాకుండా తన వయసును చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాజాగా చత్తీస్‌గఢ్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో అజింక్యా రహానే 159 పరుగులతో సత్తా చాటాడు. ఈ ఇన్నింగ్స్ అనంతరం మాట్లాడిన అజింక్యా రహానే.. సెలెక్టర్ల తీరును తప్పుబడుతు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో తన అవసరం కనిపించిందన్నాడు. ఈ సిరీస్‌లో తాను ఉంటే ఫలితం మరోలా ఉండేదని చెప్పాడు. 'వయసు కేవలం అంకె మాత్రమే. అనుభవం కలిగిన ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తే జాతీయ జట్టుకు ఎంపిక చేయాలి. వయసు ఏ మాత్రం ముఖ్యం కాదు. ఆడాలన్న ఇంటెంట్ ముఖ్యం. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో నా అవసరం కనిపించింది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. కానీ సెలెక్టర్లు నా వయసునే పరిగణలోకి తీసుకొని పక్కనపెట్టారు' అని పేర్కొన్నాడు.




## ఫైనల్‌కు చేరువగా తెలుగు టైటాన్స్!

ప్రొకబడ్డీ లీగ్(పీకేఎల్) 2025 సీజన్‌లో తెలుగు టైటాన్స్ దుమ్మురేపుతోంది. ఆదివారం జరిగిన మినీ క్వాలిఫయర్స్‌లో తెలుగు టైటాన్స్ 37-32 తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన తెలుగు టైటాన్స్ రైడింగ్‌లో సత్తా చాటి ఫస్టాఫ్ ముగిసే సమయానికి 16-14 తేడాతో ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్‌లో బెంగళూరు బుల్స్ నుంచి ప్రతిఘటన ఎదురైనా.. రైడింగ్‌లో ఎలాంటి తప్పిదం చేయకుండా ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని కైవసం చేసుకుంది. తెలుగు టైటాన్స్‌లో కెప్టెన్ విజయ్ మాలిక్(10), ఆల్‌రౌండర్ భరత్(12) సూపర్-10 పాయింట్లతో సత్తా చాటారు. ఈ ఇద్దరి అద్భుత ప్రదర్శనకు తోడుగా డిఫెండర్లు రాణించడంతో తెలుగు టైటాన్స్‌కు విజయం దక్కింది. ఈ గెలుపుతో తెలుగు టైటాన్స్ ఎలిమినేటర్-3కి అర్హత సాధించింది. మంగళవారం జరిగే ఈ మ్యాచ్‌లో ఎలిమినేటర్-2 విజేతతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే నేరుగా క్వాలిఫయర్-2కు అర్హత సాధిస్తోంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తే ఫైనల్ చేరుతోంది. ఓడితే టోర్నీ నుంచి నిష్క్రమిస్తోంది. మినీ క్వాలిఫయర్‌లో ఓడిన బెంగళూరు బుల్స్ నేడు జరిగే ఎలిమినేటర్-2లో పట్నా పైరేట్స్‌తో తలపడుతుంది. ఈ సారి తెలుగు టైటాన్స్‌దే టైటిల్ అని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## కోహ్లీ, రోహిత్ నాశనం కోరుకున్నారు: ఏబీడీ



సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ విఫలమవ్వాలని కొంతమంది కోరుకున్నారని, వారు రిటైర్మెంట్ ప్రకటించాలని భావించారని తెలిపాడు. ఈ ఇద్దరిపై అనవసరమైన నెగటివిటీని క్రియేట్ చేస్తూ విమర్శలు గుప్పించారని మండిపడ్డాడు. 'ప్రజలు ఏం అనుకుంటున్నారో అర్థం కావడం లేదు. అసలు వారిని ప్రజలు అని పిలవచ్చో లేదో కూడా తెలియదు. క్రీడాకారులు తమ కెరీర్ చివరి దశకు చేరుకోగానే.. బొద్దింకల్లా బొక్కల్లో నుంచి బయటకు వచ్చినట్లు వచ్చి విమర్శలు గుప్పిస్తారు. ఇలా ఎందుకు చేస్తారు? దేశం కోసం, క్రికెట్ కోసం తమ జీవితాన్ని ధారపోసిన ఆటగాళ్లపై ఎందుకు ఇంత నెగటివిటీని పెంచుతారు? వారిని గౌరవించుకోవడానికి ఇదే సరైన సమయం. గత కొద్ది నెలలుగా కోహ్లీ, రోహిత్ చాలా విమర్శలు ఎదుర్కొన్నారు. కారణం ఏంటో తెలియదు కానీ ప్రతీ ఒక్కరు కోహ్లీ, రోహిత్‌లను తక్కువ చేసే ప్రయత్నం చేశారు. నేను కొంతమంది గురించి ఈ వ్యాఖ్యలు చేస్తున్నాను. ఎందుకంటే మెజార్టీ ప్రజలు రోహిత్, విరాట్ కోహ్లీలను ఆరాధిస్తారు. వారి అద్భుతమైన కెరీర్‌ను కొనియాడుతారు. వారి సక్సెస్‌ను సంబరాలు చేసుకుంటారు. వారి సక్సెస్‌ను మరోసారి సెలెబ్రేట్ చేసుకోవడానికి ఇదే అద్భుతమైన సమయం'అని ఏబీ డివిలియర్స్ తెలిపాడు.



## రోహిత్ శర్మకు ఇంపాక్ట్ ప్లేయర్ అవార్డు

ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ముగిసింది. ఆతిథ్య జట్టే 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. కానీ, భారత స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫామ్‌లోకి రావడం అభిమానులకు సంతోషం కలిగించే అంశమే. రోహిత్ శర్మ సెంచరీ, హాఫ్ సెంచరీ సాధించగా.. విరాట్ ఒక అర్ధశతకం నమోదు చేశాడు. ఈ క్రమంలో భారత డ్రెస్సింగ్ రూమ్ 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును మేనేజ్‌మెంట్ ప్రకటించింది. మాజీ కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మనే ఈ అవార్డు వరించింది. ఈసందర్భంగా రోహిత్‌పై గంభీర్ ప్రశంసల వర్షం కురిపించిన వీడియోను బీసీసీఐ తమ వెబ్‌సైట్‌లో ఉంచింది. మూడో వన్డేలో సెంచరీ చేసిన అతడే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్.. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. "శుభ్‌మన్ గిల్‌తో కలిసి తొలి వికెట్‌కు రోహిత్ నిర్మించిన భాగస్వామ్యం అత్యంత కీలకమైంది. ఆ తర్వాత విరాట్ - రోహిత్ అద్భుతమైన బ్యాటింగ్ చేశారు. రోహిత్ సెంచరీతో మెరిశాడు. చివరివరకూ క్రీజ్‌లో ఉండి మ్యాచ్‌ను ముగించడం పెద్ద విషయం. ఛేజింగ్‌లో మనమెంత దూకుడుగా ఉంటామో మరోసారి చూపించాం. ఇక ఈ మ్యాచ్‌లో మన బౌలింగ్ కూడా బాగుంది. ఆసీస్ తొలి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 63 పరుగులు చేసింది. కానీ, సరైన సమయంలో విజృంభించిన మన బౌలర్లు ఆసీస్‌ను కట్టడి చేశారు. హర్షిత్ రాణాను ప్రత్యేకంగా అభినందించాలి.




## భారత పర్యటనకు సఫారీ జట్టు ప్రకటన



దక్షిణాఫ్రికా టెస్టు సారథి తెంబా బవుమా మళ్లీ జట్టులోకి వచ్చాడు. గాయం కారణంగా దూరమైన అతడు.. భారత పర్యటనతో పునరాగమనం చేయనున్నాడు. నవంబర్‌లో టీమిండియాతో రెండు టెస్టుల సిరీస్ నేపథ్యంలో సోమవారం సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. బవుమా కెప్టెన్‌గా 15 మందితో కూడిన పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు. ఇటీవల పాకిస్థాన్ పర్యటనలో అదరగొట్టిన వారికి అవకాశమివ్వాలని సెలెక్టర్లు భావించడంతో.. మిస్టరీ స్పిన్నర్ హార్మర్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. 'పాకిస్థాన్‌తో సిరీస్ డ్రా చేసుకోవడంలో కుర్రాళ్లు కీలక పాత్ర పోషించారు. అందుకే వాళ్లకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించాం. భారత్‌లోనూ పాక్ తరహా పిచ్‌లు, వాతావరణ పరిస్థితులే ఉంటాయి కాబట్టి వారిని కొనసాగించడం సరైందనిపించింది' అని హెడ్‌కోచ్ షుక్రి కొన్రాడ్ వెల్లడించాడు. నవంబర్ 14 ఈడెన్ గార్డెన్స్‌లో భారత్, దక్షిణాఫ్రికా తొలి మ్యాచ్ ఆడుతాయి. అనంతరం 22న గువాహటిలో రెండో టెస్టు జరుగుతుంది.

**దక్షిణాఫ్రికా స్క్వాడ్ :** తెంబా బవుమా(కెప్టెన్), కార్బిన్ బాస్చ్, డెవాల్డ్ బ్రెవిస్, రియాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైలీ వెర్రెనే, టోనీ డీజోర్జి, జుబయర్ హంజా, సిమన్ హార్మర్, మార్కో యాన్సెన్, కేశవ్ మహరాజ్, ఎడెన్ మర్క్‌రమ్, వియాన్ మల్డర్, సెనురన్ ముత్తుస్వామి, కగిసో రబడ.

## వరల్డ్‌కప్‌కు ప్రతీక రావల్ దూరం

మహిళల వన్డే ప్రపంచకప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమ్ఇండియా బ్యాటర్ ప్రతీక రావల్ ఫీల్డింగ్ చేస్తూ గాయానికి గురైంది. దీంతో ఆమె వరల్డ్‌కప్‌లో మిగతా మ్యాచ్‌లకు దూరమైనట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. బౌండరీ రోప్స్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న ప్రతీక బంతిని ఆపే క్రమంలో మైదానంలో జారిపడింది. దీంతో ఆమె కాలికి గాయమైంది. ఈ మ్యాచ్ వర్షం వల్ల ఆగిపోయిన విషయం తెలిసిందే. ఔట్‌ఫీల్డ్‌లో తడి పరిస్థితి వల్ల జారి, గాయపడిన అనంతరం ప్రతీక నొప్పితో విలవిల్లాడింది. టీమ్ సపోర్టింగ్ స్టాఫ్ సాయంతో ఆమె మైదానాన్ని వీడింది. సెమీఫైనల్‌కు ముందు ఇది భారత మహిళల జట్టుకు పెద్ద ఎదురు దెబ్బే అని చెప్పాలి. గురువారం (అక్టోబర్ 30) టీమ్ఇండియా, ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌కు ఆమె అందుబాటులో ఉండే అవకాశాలు కనిపించడం లేదు. ఒక వేళ టీమ్ఇండియా ఫైనల్‌కు చేరుకున్నా.. ఆమె ఆడేది అనుమానమే!



# వైకుంఠపాళి.. జీవితానికి ఆదర్శం

"కైలాసం" అని, "పరమపదసోపానం"అని, "పాములపటం" అని రకరకాలుగా పిలిచే ఆటే.. వైకుంఠపాళి. చిన్నాపెద్దా, ఆడామగా తేడా లేకుండా అందరూ ఆడుతూ సంతోషించే పాతకాలం సాంప్రదాయకమైన వినోదాత్మక ఆటనే ఈ వైకుంఠపాళి.తెలుగు ప్రాంతంలో దీనిగురించి తెలియనివారు,ఆడని వారు లేరు. కానీ నేటి తరానికి అందడం లేదు. ఈ రోజుల్లో చిన్నారులు మరియు యువత కేవలం ఆన్లైన్ గేమ్స్ తో కాలం గడుపుతున్నారు.



వైకుంఠ ఏకాదశి రోజు రాత్రి జాగారం చేస్తూ ఈ ఆట ఆడడం వల్ల, నియమనిబంధనలు జీవితానికి అనుకూలంగా ఉండడం వల్ల ఈ ఆట చాల కాలం క్రితం ఎంతో ఆదరణకు నోచుకుంది. దీనిలో వినోదంతో పాటు విజ్ఞానం,ఆద్యాత్మికం,తత్వచింతన దాగి ఉండటం వలన ఎవరి వయసుకు మేధాశక్తికి తగ్గట్టు వారు ఆస్వాదించ గలిగేలా ఉండడం వల్ల అంత ప్రసిద్ధి చెందింది. వైకుంఠపాళి ఆట క్రీ.పూ 2వ శతాబ్దము నుంచి భారతదేశములో ఉన్నదని చరిత్రకారులు భావిస్తున్నారు. సాధారణంగా ఇద్దరు మనుషులు నీడపట్టున కూర్చొని ఆడే ఒక సాంప్రదాయపు ఆటగా ప్రసిద్ధి చెందింది.ఈ ఆట ఒక చదరము పై ఆడతారు. ఈ చదరములో సాధారణంగా 10 అడ్డవరుసలు, 10 నిలువువరుసలతో మొత్తం 100 గడులుంటాయి. అయితే కొన్ని రూపాంతరాలలో 8 అడ్డ నిలువు వరసలు, 12 అడ్డ నిలువు వరుసల చదరాలు కూడా ఉంటాయి. చదరంపై చిత్రించబడి ఉన్న పాములు, నిచ్చెనలు అమరిక ప్రతీ చదరాన్ని బట్టి మారుతుంటుంది. పాములు, సోపానాలు నిర్దిష్టమైన గడులలో ఉండనవసరం లేదు. చదరంలో యొక్క పరిమాణము, చదరంలో పాములు, సోపానాల అమరికపై ఆట యొక్క ముగింపు సమయం ఆధారపడి ఉంటుంది.

వైకుంఠపాళీ తెలుగు వారికి ప్రత్యేకమయిన ఆట. వైకుంఠపాళీ పటాన్ని పరమపదసోపానపటమని కూడా వ్యవహరిస్తారు. వైకుంఠపాళీ పటంలో 132 గళ్ళు ఉంటాయి. ఈ గళ్ళు రకరకాలయిన బొమ్మలతో అంకెలు వేసి ఉంటాయి. ఈ గళ్ళకు దిగువన పాములు, ఏనుగులు ఉంటాయి. అది పాతాళమనీ, ఆ ఏనుగులు అష్టదిగ్గజాలనీ పైనున్న అంకెలు ఉన్న గళ్ళ ను భూమిని ఆ ఎనిమిది ఏనుగులూ మోస్తున్నాయనీ కొందరు భావిస్తారు.ఆట ప్రారంభములో దేవుడికి దండం పెట్టుకొని ప్రారంభించడం నాటి ఆనవాయితీ. ఆట ప్రారంభించే ముందు ఆటగాళ్ళు తమ తమ ఆటకాయలను పాతాళంలో ఉంచి పందెం వేస్తూ పందాన్ని బట్టి ఆటకాయలను నడుపుతూ ఉంటారు. ఆరు గవ్వలుగాని లేదా పాచికలుగాని పందెం వేస్తూ ఆడుతారు. ఈ ఆటను ఎందరైనా ఆడవచ్చు. అయితే ఆడే వాళ్ళు మాత్రం ఒక్కొక్కరు ఒక్కొక్కరకం ఆటకాయలను ముందుగా ముందే నిర్ణయించుకోవాలి. వైకుంఠపాళీ పటంలో 16, 19, 30, 41, 52, 63, 74, 79, 87 సంఖ్యలు గల గళ్ళల్లో నిచ్చెనలు ఉన్నాయి. ఏ పందానికైనా ఆటకాయ ఆయా గళ్ళలోనికి వచ్చినప్పుడు అక్కడ ఉన్న నిచ్చెన సాయంతో పై గడికి చేరుకోవచ్చు. ఉదాహరణకు 16 వ గడిలో ఉన్న నిచ్చెన దగ్గరకు ఆటకాయ వచ్చినప్పుడు ఆ నిచ్చెన సాయంతో 28 వ గడిని చేరుకుంటుంది. అలా చేరుకోవడాన్ని 'నిచ్చెన ఎక్కడం' అంటారు. పుణ్యం చేసిన వారికి పుణ్యం దక్కి నిచ్చెనెక్కడమవుతుందని చెబుతారు. అప్పుడు పై పందెం వేసుకునే అవకాశం ఇస్తారు. పై పందెంవల్ల మళ్ళీ నిచ్చెన ఎక్కినట్లయితే మళ్ళీ మరో పై పందెం- ఇలా ఆట కొనసాగుతూ ఉంటుంది.

ఈ పటంలో నిచ్చెనలు ఉన్నట్లుగానే అక్కడక్కడ పాములు కూడా ఉన్నాయి. ఆటకాయ నిచ్చెన పాదం దగ్గరికి వచ్చినప్పుడు పైకి వెళ్ళినట్లే పాము తల దగ్గరికి ఆటకాయ వచ్చినప్పుడు పాము కరిచి/మింగి ఆటకాయ పాము తోక చివరివరకూ కిందికి దిగిపోతుంది. కాగా 26 వ గడిలో ఉన్నది పాము కరచినప్పుడు దాని తోక ఉన్న 3వ గడికి వచ్చి అక్కడ ఉన్న చిన్న పాము మూలంగా ఆటకాయ పాతాళం చేరుకుంటుంది. ఇట్లు పాముతోక దగ్గరకు రావడాన్ని 'పాము మింగడం' అంటారు. ఇక 106వ గదిలో ఉన్న పెద్ద పాము మింగిందంటే ఆటకాయ ఒకేసారి 1వ గడిని చేరుకుంటుంది. చివరకు 121 గడిలో ఉన్న పామును తప్పించుకుని 122వ గడికి ఆటకాయ చేరుకున్నట్లయితే పుణ్యపథంలో పడ్డట్టే. అలా, ఆ తరువాతనున్న 132వ గడిని దాటి పైనున్న స్వర్గధామన్ని ఆటకాయ చేరుకుంటుంది. అక్కడినుండి చివరివరకూ వెళ్ళి తిరుగుముఖం పట్టి మధ్యనున్న విరాట్ స్వరూపాన్ని చేరుకోవాలి. తిరుగు ముఖం పట్టి, వచ్చేటప్పుడు ఏ పందెంలో సరిగ్గా విరాట్ స్వరూపాన్ని చేరుతుందో ఆ పందెం పడినప్పుడే ఆటకాయ పండినట్లు చెప్పవచ్చును. అంతవరకూ ఆ వరుసలో ముందరికీ వెనుకకూ ఆటకాయను నడుపుతూ ఉండాలి. విరాట్ రూపానికి ఆ వైపూ ఈ వైపూ ఉన్న బొమ్మల్ని ద్వారపాలకులనీ, వారు విరాట్ దర్శనం కాకుండా అడ్డగిస్తూ ఉంటారనీ, అందువల్ల వాళ్ళ చుట్టూ తిరిగిన తర్వాతనే ఆఖరికి విరాట్ దర్శనం అవుతుందని ఆనాటి ప్రజల నమ్మకం. అయితే నేడు ఇదే ఆటను కొద్దిగా మార్చుతూ మన జీవన శైలికి అనుకూలంగా పెర్లను పెడుతూ పౌష్టికాహారం తీసుకుంటే కలిగే లాభాలను సూచిస్తూ,పండ్లు కూరగాయలు తినవలేనని,న్యాయంగా ఉండవలెనని విధంగా బొమ్మలతో కూడిన చదరాలు విద్యార్థులకు ఉపయోగిస్తున్నారు. అంతే కాక కుడికాలు,తీసివేతలు, గుణకారాలు బాగహారలు నేర్పించడం కోసం ఈ ఆటను మార్పు చేసి చిన్నారులకు అందిస్తున్నారు.ఏది ఏమైనా ప్రాచీన ఆటలు మన జీవితాలకు ఆదర్శం అనేది మరువ లేనిది.



గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963498282
raghupatiraog@gmail.com



# కొత్త ప్రపంచం.. యానిమేషన్

## (నేడు అంతర్జాతీయ యానిమేషన్ డే)

అంతర్జాతీయ యానిమేషన్ డే ప్రతి సంవత్సరం అక్టోబర్ 28న జరుపుకుంటారు. ఈ రోజు యానిమేషన్ కళా రూపాన్ని, దాని చరిత్రను, సాంకేతికతను మరియు సృజనాత్మకతను సెలబ్రేట్ చేస్తుంది. ఈ రోజు మొదట 2002లో ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ అసోసియేషన్ (ఏఎస్ఐఎఫ్ఏ) ఆధ్వర్యంలో స్థాపించబడింది. ఈ రోజు 1892లో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో ఎమిలీ రేనాడ్ చేత ప్రదర్శించబడిన మొట్టమొదటి యానిమేషన్ షోను స్మరించుకుంటుంది. 1892 అక్టోబర్ 28న, ఎమిలీ రేనాడ్ తన "థియేటర్ ఆప్టిక్" ద్వారా పారిస్‌లోని మ్యూజియం గ్రేవిన్‌లో మొట్టమొదటి యానిమేషన్ ప్రదర్శనను నిర్వహించాడు.

ఈ ప్రదర్శనలో అతను ఓ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించాడు, ఇది ప్రపంచంలోనే మొదటి యానిమేషన్ చలనచిత్రం. రేనాడ్ థియేటర్ ఆప్టిక్ ఒక ప్రొజెక్టర్ లాంటి పరికరం, ఇది చేతితో గీసిన చిత్రాలను కదిలే బొమ్మలుగా ప్రదర్శించడానికి ఉపయోగించబడింది. ఇది ఆధునిక యానిమేషన్‌కు పునాది వేసింది. ఏఎస్ఐఎఫ్ఏ 1960లో స్థాపించబడింది, ఇది యానిమేషన్ కళాకారులు, చిత్రనిర్మాతలు మరియు ఔత్సాహికులను ఒకచోట చేర్చే అంతర్జాతీయ సంస్థ. 2002లో, యానిమేషన్ చరిత్రను గౌరవించడానికి, ఈ కళా రూపాన్ని ప్రోత్సహించడానికి అంతర్జాతీయ యానిమేషన్ డేని ప్రారంభించింది. ఈ రోజు ఎమిలీ రేనాడ్ యొక్క మొదటి ప్రదర్శన తేదీని గుర్తుచేస్తూ ఎంపిక చేసింది. ఎమిలీ రేనాడ్ థియేటర్ ఆప్టిక్‌కు ముందు, జోట్రోప్, ఫెనాకిస్టోస్కోప్ వంటి పరికరాలు కదిలే చిత్రాలను సృష్టించడానికి ఉపయోగించారు. ఈ పరికరాలు ఆప్టికల్ ఇల్యూషన్‌ను ఉపయోగించి చిత్రాలను కదిలేలా చేశాయి, ఇది యానిమేషన్ యొక్క ప్రారంభ రూపాలు. 1910ల్లో, 1920లలో, వాల్ట్ డిస్నీ, ఇతరులు సెల్ యానిమేషన్ టెక్నిక్‌ను అభివృద్ధి చేశారు, ఇది యానిమేషన్‌ను మరింత సులభతరం చేసింది. 1928లో వాల్ట్ డిస్నీ యొక్క "స్టీమ్‌బోట్ విల్లీ" మొదటి సౌండ్‌తో కూడిన యానిమేషన్ చిత్రంగా గుర్తింపు పొందింది, ఇది మిక్కీ మౌస్ పాత్రను పరిచయం చేసింది. 1937లో డిస్నీ యొక్క "స్నో వైట్ అండ్ ది సెవెన్ డ్వార్ఫ్స్" మొదటి పూర్తి నిడివి యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్‌గా చరిత్రలో నిలిచింది. 1990లలో కంప్యూటర్-జనరేటెడ్ ఇమేజరీ యానిమేషన్ పరిశ్రమను విప్లవాత్మకంగా మార్చింది. 1995లో పిక్సర్ "టాయ్ స్టోరీ" మొదటి పూర్తి-నిడివి సీజీఐ యానిమేటెడ్ చిత్రంగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం 2డీ, 3డీ, స్టాప్-మోషన్, మోషన్ క్యాప్చర్ వంటి వివిధ యానిమేషన్ టెక్నిక్‌లు ప్రపంచవ్యాప్తంగా ఉపయోగిస్తున్నారు. అంతర్జాతీయ యానిమేషన్ డే రోజున.. యానిమేషన్‌ను ఒక సృజనాత్మక, సాంస్కృతిక కళా రూపంగా గుర్తించడం, దాని ప్రాముఖ్యతను ప్రచారం చేయడం, యానిమేషన్ చరిత్ర, సాంకేతికతలు, కళాకారుల గురించి ప్రజలకు తెలియజేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## ఇండియాలో..

- భారతదేశంలో యానిమేషన్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది, ముఖ్యంగా బాలీవుడ్, టెలివిజన్, మరియు గేమింగ్ రంగాలలో.
- అంతర్జాతీయ యానిమేషన్ డే సందర్భంగా, భారతదేశంలోని పలు నగరాలలో యానిమేషన్ స్టూడియోలు, ఫిల్మ్ స్కూళ్లు, మరియు సాంస్కృతిక సంస్థలు ఈవెంట్‌లను నిర్వహిస్తాయి.
- ఉదాహరణకు, ముంబై, హైదరాబాద్, బెంగళూరులోని యానిమేషన్ స్కూళ్లు స్క్రీనింగ్‌లు, వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేస్తాయి.



వినోద్ కుమార్

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.